ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 19 అక్టోబరు 2024




సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

కేసుల దర్యాప్తునకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దోహదం : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేసుల దర్యాప్తు సమయంలో లీగల్ డాక్యుమెంటేషన్ సిస్టమ్స్, ఫేషియల్ రికగ్నేషన్ టెక్నాలజీతో నేరస్తులను జిల్లా పోలీస్ యంత్రాంగం గుర్తిస్తున్నట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. భారతదేశ హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఎదురయ్యే సవాళ్ళపై జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ప్యానల్ స్పీకర్‌గా ఆహ్వానం అందుకున్న ఎస్పీ హాజరై ప్రసంగించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, పరిశోధన, పోలీస్ యంత్రాంగం తీసుకుంటున్న మెలకువలు, ఆత్యాధునిక సాధనాల అంశాలపై మాట్లాడారు. అనుమానితులను గుర్తించడానికి దర్యాప్తును క్రమబద్ధీకరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానం ఉపయోగపడుతుందన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శులు, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు, సీనియర్ ఐపీఎస్ అధికారులు, అధికారులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలును అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్ర భవనాలు, టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరిన్ని కార్యక్రమాలను వేతనాల పద్దు కింద చేపట్టి చేస్తే జిల్లాకు మరిన్ని పనులు మంజూరయ్యే అవకాశం ఉందని అధికారులు ఈ దిశగా కృషి చేయాలన్నారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డీపీవో అనూరాధ, డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ జేడీలు హబీబ్ బాషా, నెహ్రూబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, డీఈవో అబ్రహం, డీఎస్‌వో సత్యనారాయణ రాజు, ఏపీఎంఐపీ పీడీ రవి కుమార్, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్, డ్వామా పీడీ సుబ్బారావు పాల్గొన్నారు.

వినియోగంలోకి చెత్త సంపద తయారీ కేంద్రాలు

జేసీ ధాత్రిరెడ్డి

కైకలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని జేసీ ధాత్రిరెడ్డి అన్నారు. కైకలూరు పంచాయతీలో డంపింగ్ యార్డు నిర్మాణానికి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. జేసీ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కైకలూరు సివిల్ సప్లయిస్ గొడౌన్‌ను తనిఖీ చేసి అక్కడ నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీలక్ష్మీ, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే కఠిన చర్యలు

కమిషనర్ బాలప్రతాప్

ఏలూరు టూటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగర రోడ్లపై పశువులను విడిచిపెడితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ బాలప్రతాప్ హెచ్చరించారు. 'గతంలోనే పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేశాం. అయినా నగర వీధుల్లో పశువులను విచ్చలవిడిగా వదిలిపెడుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై కన్పించే పశువులను గోసంరక్షణ సమితులకు తరలించి వాటి పోషణకు అయ్యే ఖర్చును యజమానుల నుంచి వసూలు చేస్తాం. అంతే కాకుండా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటా'మన్నారు.



తిరువీధుల మెరసీ.. దేవదేవుడు

ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం క్షేత్ర పురవీధుల్లో శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. తిరుకల్యాణ మహోత్సవం జరిగిన మర్నాడు రథోత్సవాన్ని జరపడం సంప్రదాయం. ఆలయంలో ఉభయ దేవేరులతో స్వామిని తొళక్కం వాహనంపై ఉంచి అలంకరించి, రథం వద్దకు తీసుకొచ్చారు. రథంలోని సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి క్షేత్ర పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి తొలుత రథానికి బలిహరణ సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో రోజుకో అలంకారంలో కటాక్షిస్తున్న స్వామి శుక్రవారం చంద్రకోలు, దండం ధరించి సర్వాభరణాలతో రాజమన్నార్‌గా దర్శనమిచ్చారు.

ద్వారకాతిరుమల/ఆంధ్రజ్యోతి:



ఆఫ్‌లైన్‌లోనూ అవే కష్టాలు

దళారులకు కాసుల పంట పండిస్తున్న ఇసుక

బ్లాక్ మార్కెట్‌లో జోరుగా అమ్మకాలు

క్షేత్రస్థాయిలో ప్రజలకు తప్పని తిప్పలు

పాలకొల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దళారుల ప్రమేయం లేకుండా వినియోగదారులే నేరుగా ఇసుక బుక్ చేసుకోవడానికి రీచ్‌లలో ఆఫ్‌లైన్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అన్ని ర్యాంపులలో ఆఫ్‌లైన్ విధానంలో శుక్రవారం నుంచి ఈ అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియతో ఆన్‌లైన్ విధానంలో దళారులు ఇతరుల పేరున ఇసుక బుక్ చేసి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్న విధానానికి అడ్డుకట్ట పడుతుందని అంతా భావించారు. కాని, క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా వుంది. వెబ్‌సైట్‌లో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతుండగా మరోవైపు ఇసుక అవసరం ఉన్న వారు కిలోమీటర్ల దూరం వెళ్లి రీచ్‌లలో బుక్ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పాలకొల్లు, నరసాపురం, భీమవరం వంటి పట్టణాల్లో ఇసుక వినియోగదారులు ర్యాంపులకు వెళ్లి ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకోవాలంటే 50, 60 కిలోమీటర్లు వెళ్లాలి. దీంతోపాటు ఆయా ఇసుక ర్యాంపుల సమీపంలోని దళారులే బినామీ పేర్లతో ఆధార్ కార్డులు చూపించి ఇసుక బుక్ చేసుకుని బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అయా ప్రాంతాలను బట్టి ఐదు యూనిట్ల ధర రూ.25 వేల నుంచి 30 వేల వరకు పలుకుతోంది. నాలుగు రోజులుగా ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌లో స్లాట్ తెరవగానే దళారులు బుకింగ్ ప్రారంభించడంతో గ్రామీణులు, పెద్దగా కంప్యూటర్ విజ్ఞానం లేని వారు బుక్ చేసుకోలేకపోతున్నారు.

మరోవైపు తుర్పు గోదావరి జిల్లాలో పడవ ర్యాంపులలో ఇసుక సేకరించే కార్మికులకు సకాలంలో సొమ్ములు అందకపోవడంతో సేకరణ తగ్గిపోయింది. దీంతో ఇసుకకు డిమాండ్ ఉన్నప్పటికీ సేకరణ లేక బ్లాక్ మార్కెట్ కొనసాగుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంకా ర్యాంపులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. తూర్పు గోదావరి జిల్లా పెండ్యాల, వాడపల్లి, కొవ్వూరు, ఔరంగాబాద్, మరో రెండు ర్యాంపులలో ఇసుక ఎగుమతులు అవుతున్నప్పటికీ రోజుకు 150 నుంచి 200 లారీలకు మాత్రమే ఇసుక లభ్యమవుతోంది. పూర్తిస్థాయిలో ఇసుక అవసరాలకు సరిపడా సేకరణకు మరో 20 రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకూ దళారులు ప్రమేయం తగ్గేటట్లు కనిపించడం లేదు.


ఆన్‌లైన్ విధానాన్నే మరింత మెరుగుపరిచి అన్ని వర్గాల ప్రజలకు బుకింగ్ వెసులుబాటు కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు. రీచ్‌లలో కంప్యూటర్ బిల్లింగ్ కాకుండా నగదు చెల్లించి ఇసుక తెచ్చుకునే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పరపతితో లారీలను ఉపయోగించి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

సీనరేజ్ వసూళ్లు ఎత్తివేత

సీనరేజ్ చార్జ్ వసూళ్లను ఎత్తి వేస్తున్నట్టు సీఎం చంద్రబాబు శుక్రవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. లారీల్లో 40 టన్నులకు మించి వున్నా అధికలోడ్ జరిమానాలు ఉండవని తెలిపారు. రీచ్‌ల నుంచి ట్రాక్టర్లలో ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. పై స్థాయిలో మెరుగైన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికి క్షేత్రస్థాయిలో వీటిని అధికారులు పకడ్బందీగా అమలు చేయాల్సి వుంది.

ఇసుక అందుబాటులో లేక నిలుస్తున్న ఇళ్ల నిర్మాణాలు.. పనులు లేక వలసబాట పడుతున్న కూలీలు -6లో..





తప్పటడుగులు వేయవద్దు

టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తప్పటడుగులు వేయవద్దని సీఎం చంద్రబాబు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు దిశా నిర్దేశం చేశారు. చిత్రంలో ఎమ్మెల్యేలు రోషన్ కుమార్, బడేటి చంటి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రఘురామకృష్ణరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. - ఏలూరు సిటీ/ఆంధ్రజ్యోతి



మార్చురీలో శవం మాయం చేస్తుండగా..

-7లో



ఏలూరు ఈఎస్ఐ డిస్పెన్సరీలో..

అందని వైద్యం..!

- వైద్యులు.. సిబ్బంది కొరత
- కార్మికుల అవస్థలు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో సరైన వైద్యసదుపాయాలు లేక కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిస్పెన్సరీ పరిధిలో 24,042 మంది కార్మికులు ఉన్నారు. ఇక్కడ నలుగురు డాక్టర్లతో సహా నర్సులు, ఫార్మాసిస్టులు, ఇతర సిబ్బంది కలిపి 23 మంది ఉండాలి. కానీ కేవలం 8 మంది సిబ్బందే ఉన్నారు. నలుగురు డాక్టర్లు ఉండాల్సిన డిస్పెన్సరీలో కేవలం ఒక్క డాక్టర్ తోనే నెట్టుకొస్తున్నారు. ఆయన కూడా సెలవు పెడితే అక్కడ సిబ్బందే మందులిస్తుంటారు. గతంలో నిత్యం 400- 500 మంది కార్మికులు డిస్పెన్సరీకి వైద్యం కోసం వచ్చేవారు. సరైన వైద్యులు లేక వైద్యం అందక అవుట్ పేషేంట్ల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం రోజుకు వంద మంది కూడా రాని పరిస్థితి. సరైన వైద్యసదుపాయాలు లేకపోవడంతో కార్మికులు అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఇన్‌పేషెంట్‌లుగా చేరాలంటే విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్ళాల్సిందే.

జగన్ సర్కార్ పట్టించుకోలేదు..

ఈఎస్ఐ డిస్పెన్సరీని గత జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణానికి స్థలాలివ్వండి అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్పట్లో కోరింది. కానీ వైసీపీ సర్కార్ స్థలాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఆస్పత్రుల నిర్మాణానికి 87.5 శాతం కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తుంది. మిగిలిన 12.5 శాతం నిధులు ఇచ్చేందుకు కూడా వైసీపీ సర్కార్ ముందుకు రాలేదు.

సరైన వైద్య సదుపాయాలు లేవు



ఏలూరు ఈఎస్ఐ డిస్పెన్సరీ పరిధిలో కార్మికులకు తగ్గట్టుగా ఇక్కడ వైద్య సదుపాయాలు లేవు. సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. డాక్టర్లను అదనంగా నియమించాలి. ఏలూరు డిస్పెన్సరిని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలి.

- డీఎన్‌వీడీ ప్రసాద్, సీఐటీయూ నాయకుడు

మందుల కొరత లేదు



ఇన్‌పేషెంట్‌లుగా ఆస్పత్రిలో చేరేవారిని విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలిస్తున్నాం. కార్మికులకు సరిపడ మందులు అందుబాటులో ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే.

డాక్టర్ టి.నారాయణరావు, వైద్యులు


లింగపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ అశోక్

మద్యం షాపులు తొలగించండి..

లింగపాలెం/ కొయ్యలగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : లింగపాలెం దళితవాడలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ లింగపాలెం ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలిసి ఎక్సైజ్ సీఐ అశోక్ ఘటనా స్థలికి వెళ్లి గ్రామస్థులతో మాట్లాడారు. మద్యం షాపును తాత్కాలికంగా మూసి వేయించారు. షాపు మార్పే విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ శుక్రవారం పోలవరం ఎక్సైజ్ అధికారులకు ఆ ప్రాంత ప్రజలు వినతి పత్రం ఇచ్చారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఆ మద్యం షాపు ఎదురుగా ఒక ప్రైవేటు పాఠశాల, కళాశాల, ఆస్పత్రి ఉన్నాయని, విద్యార్థులు, రోగులు ఇబ్బందులకు గురవుతారని వినతి పత్రంలో పేర్కొన్నారు.


ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న కొయ్యలగూడెం గ్రామస్థులు

ప్రత్యేక ఆకర్షణ.. ఇస్రో మొబైల్ బస్సు 7

నిర్వాసితుల వెతలు తీరేనా..


2022 గోదావరి వరదలకు కూలిన ఇళ్లు (ఫైల్)

పునరావాస పరిహారం కోసం ఎదురు చూపులు


కివ్వాక పునరావాస కాలనీలో తలదాచుకున్న నిర్వాసితులు

కుక్కునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, పునరావాసానికి కేంద్రం ఇటీవల నిధులు విడుదల చేస్తూ కొన్ని షరతులు విధించింది. భూసేకరణ, పునరావాసం కోసం రూ.1,165 కోట్లు ఐదు నెలల్లో ఖర్చు చేయాలి. తొలిదశ 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని నిర్వాసితులకు కాలనీలు నిర్మించి పునరావాస ప్యాకేజీ అందించి తరలించాలి. దీంతో 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితులు తమ కష్టాలు తీరుతాయని పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఇదిగో పరిహారం అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఊరించి మొండిచెయ్యి చూపింది.

మూడేళ్లుగా పునరావాస కాలనీలోనే..

కుక్కునూరు మండలంలో 41.15 కాంటూరు లెవెల్‌లో ఎనిమిది ముంపు గ్రామాలున్నాయి. అందులో ఏ-బ్లాక్ ఒకటి. 2022 గోదావరి ముంచెత్తింది. ఏ-బ్లాక్ నిర్వాసితులు రెండు కిలోమీటర్ల దూరంలో గిరిజనుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలో తలదాచుకున్నారు. కూలిన ఇళ్లు తిరిగి నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేక 120 కుటుంబాలు మూడేళ్లుగా కివ్వాక నిర్వాసిత కాలనీలోనే ఉంటున్నారు. వాస్తవానికి కుక్కునూరు ఏ-బ్లాక్ నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస పరిహారం చెల్లించి జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెంలో నిర్మిస్తున్న పునరావాస కాలనీకి తరలించాల్సి ఉంది.

కష్టాలతోనే జీవనం

41.15 కాంటూరు లెవెల్‌లో నిర్వాసితులు పరిహారం కోసం ఎదురు చూస్తూ చెదిరిన బతులకులతో జీవచ్ఛవాల్లా కాలం గడుపుతున్నారు. పరిహారం వస్తుందనే ఆశతో కొందరు అప్పులు చేసి ఆడపిల్లలు పెళ్ళిళ్ళు చేశారు. ఇస్తామన్న కట్నం ఇవ్వకపోవడంతో కుటుంబాల మధ్య గొడవలు రేగి కొందరు ఆడపిల్లలు పుట్టింటికి చేరుతుండడంతో నిర్వాసిత కుటుంబాలు కన్నీటి పర్యంతమవుతున్నాయి. నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్ళి ఉద్యోగం చేసుకోవాలనే ఆశ ఉనాన స్థానికంగా లేకపోతే పరిహారం రాదనే భయంతో కూలి పనులకు వెళ్తున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు



గోదావరి వరదలకు నా ఇల్లు కూలింది. తిరిగి ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేక మూడేళ్లుగా పునరావాస కాలనీలోనే జీవనం గడుపుతున్నాం. కొత్త ప్రభుత్వమైనా పరిహారం చెల్లించి పునరావాస కాలనీ నుంచి తరలిస్తుందని ఆశలు పెట్టుకున్నాం.

ఎండీ పుల్లా, కుక్కునూరు ఏ-బ్లాక్ నిర్వాసితుడు


న్యాయం చేయండి..



ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణంలో చూపించిన శ్రద్ధ నిర్వాసితులపై చూపించడం లేదు. నిర్వాసితులకు పరిహారం పూర్తిస్థాయిలో అందించిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి.

వై.నాగేంద్రరావు, ఏ.బ్లాక్ నిర్వాసితుడు, సీపీఎం మండల కార్యదర్శి.

ఏటా నష్టపోతున్నాం..



ఏటా గోదావరి వరదలకు ముంపునకు గురవుతున్నాం. ఈ బాధలు పడలేక ఉన్న ఇళ్లను వదిలిపెట్టి ఐదు కిలోమీటర్ల దూరంలోని ఇసుకపాడులో నివాసం ఉంటున్నాను. మా పరిహారం మాకు ఇవ్వండి.

వి.నాగరాజు, కుక్కునూరు ఏ.బ్లాక్‌నిర్వాసితుడు.

సమ్‌థింగ్ స్పెషల్

పుంజులు లేవండి..!



పశ్చిమ అంటే కోడి పందాలకు పెట్టింది పేరు. చాలామందికి పందేల అలవాటు ఉంటుంది. అందుకే కోడిపుంజులు అంటే కూడా మక్కువ చూపుతారు. తాడేపల్లి గూడెం మండలం దండగర్రలోని తన అగ్రికల్చర్ ఫామ్‌లోని గేటుకి ఇలా కోడి పుంజులు బొమ్మలు పెట్టారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు అది పుంజుల ఫాం అనుకుని లోపలకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆ ఫాం యజమాని బలుసులరావు తనకు పుంజులపై ఉన్న మక్కువతోనే ఇలా గేటు ముందు ఇలా పెట్టానని లోపల పుంజులు లేవని చెప్పాల్సి వస్తోంది..

-తాడేపల్లిగూడెం రూరల్



ఇవి..వెరీ గుడ్డు గురూ..!

కోడిగుడ్లు పోషకాహార గని అని అందరికీ తెలుసు. కానీ ఈ గుడ్లు మరీ స్పెషల్ అంటూ సూపర్ బజార్లలో కనిపిస్తున్నాయి. ఫారం గుడ్లు తింటూ బలం, ఆరోగ్యం వస్తాయని భావించే గుడ్డు ప్రేమికులకు ఈ స్పెషల్ గుడ్లు ఊరిస్తున్నాయి. గతంలో బయట లభించే గుడ్ల కంటే నాటు గుడ్లు మరింత శ్రేయస్కరమని భావించేవారు. అందరికీ నాటు గుడ్లు దొరకడం కష్టం.. అంతేకాకుండా రేటు కూడా ఎక్కువే. ఇప్పుడు సూపర్ మార్కెట్‌లలో లభించే ఈ స్పెషల్ గుడ్లు రోగనిరోధక శక్తి పెంచడంతో పాటు, బరువు తగ్గించడం, క్యాన్సర్‌లను అరి కట్టడం, గుండెను ఆరోగ్యంగా ఉంచుతుందని చెబుతున్నారు. అలాగే పిల్లలకు కూడా ప్రత్యేకించి గుడ్లు ఉన్నాయని వాటిలో విటమిన్ బి-12 లభిస్తుందని చెబుతున్నారు. మందులు, ఇంజెక్షన్లు వాడకుండా కోళ్లకు నాణ్యమైన మేత అందించడం ద్వారా వీటిని ఉత్పత్తి చేస్తున్నారని ఇవి హైదరాబాద్ నుంచి వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇవి ఒక్కోటి రూ.12 వరకు విక్రయిస్తున్నారు..

-తాడేపల్లిగూడెం రూరల్



కారు.. మేడెక్కిందా !?

కారు మేడెక్కడం ఏమిటని అనుకుంటున్నారా.. ముదినేపల్లిలో ఓ వైద్యుడు తన ఇంటిపై ఇలా సెట్ చేశారు..భవనంపై అంతస్థులో నిర్మించిన ఈ ఆకృతిని దూరం నుంచి చూసి నిజంగా కారే అనుకుంటారు.. కానీ కారు రూపంలో ఉన్న వాటర్ ట్యాంక్ అది.. కొంతమంది రోటీన్‌కు భిన్నంగా ఆలోచిస్తారు.. ఆ కోవలోనే ముదినేపల్లికి చెందిన ప్రైవేట్ వైద్యుడు అంబుల మనోజ్ తమ నివాస భవనంపై మారుతీ కారు రూపంలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. సుమారు రెండు వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఈ కారు రూపంలోని వాటర్ ట్యాంక్‌ను పూర్తిగా సిమెంట్, ఐరన్ కాంక్రీట్‌తోనే నిర్మించారు. ఇందుకు సుమారు లక్ష రూపాయల ఖర్చయిందట. అటుగా వెళుతున్న ఎవరైనా ఈ భవనంపై ఉన్న వెరైటీ వాటర్ ట్యాంక్ వైపు ఒక లుక్ వేయకుండా వెళ్లరు.

-ముదినేపల్లి



హెల్మెట్ అవశ్యకతపై బైక్‌పై ఇలా..

సేవే..ఆమె మార్గం..

చింతలపూడికి చెందిన నాగదేశి థెరిసమ్మ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ మూడేళ్ల క్రితం రిటైర్ అయ్యారు. పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు విద్యార్థులకు కొత్త తరహా విషయాలు చెప్పి వారిలో అవగాహన కల్పించేవారు. రిటైర్ అయిన తరువాత మూడేళ్లుగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు సేవలు అందించాలని జీతభత్యం లేని సేవకురాలిగా ఆసుపత్రిలో వచ్చిన రోగులకు సేవలు అందిస్తున్నారు. ఇటీవల విజయవాడలో దేవీనగర్ వెళ్లి వరద బాధితులకు పది రోజులపాటు సేవలు అందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయి. బాధ్యత-భద్రత పేరుతో తన స్కూటర్‌పై పోస్టర్లు అంటించి తాను హెల్మెట్ ధరించి స్కూటర్‌పై తిరుగుతూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. నీమీద ఆధారపడి కుటుంబ సభ్యులు ఉన్నారని గుర్తించి బాధ్యతతో వాహనాలు నడిపితే భద్రతగా ఉంటారని వివరిస్తూ పట్టణంలో అవగాహన కల్పిస్తున్నారు.

- చింతలపూడి

అట్లతద్దోయ్ ఆరట్లు..ముద్దపప్పోయ్ మూడట్లు



పోలవరం/ఆకివీడు/పాలకొల్లు అర్బన్,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : అట్ల తద్దోయ్ ఆరట్లు..ముద్దపప్పోయ్ మూడట్లు అంటూ గ్రామాల్లో పెళ్ళికాని పిల్లలు పాడుతూ లయబద్ధంగా ఆడుతున్న దృశ్యాలను చూడా లంటే రెండు కళ్లూ చాలవు. అట్లతద్ది కోసం, అమ్మాయిల ఆటపాటల కోసం యువకులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. పెళ్లయిన మహిళలు తమ మాంగళ్యాన్ని కాపాడమంటూ గౌరీదేవికి భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉండి పూజలు చేసేది కూడా ఈ రోజే. ప్రతి ఏడాది ఆశ్వయుజ బహుళ తదియ నాడు స్త్రీలంతా ఆనందోత్సాహాలతో జరుపుకునే పం డుగ అట్లతద్ది. అట్లతద్దికి ముందు రోజు స్త్రీలంతా చేతులకు పాదాలకు గోరింటాకు పెట్టుకుని ఎవరి చేయి బాగా పండిందో చూసు కుని మురిసి పోతుంటారు. కన్నె పిల్లలకు బాగా పండితే మంచి భర్త వస్తాడని, వివా హితలకు బాగా పండితే వారి మాంగల్య సౌభాగ్యం కలకాలం నిలుస్తుందని భావిస్తారు. అట్లతద్ది పండుగరోజున అట్లు వండి అమ్మవారికి నివేదన చేస్తారు. గ్రామాల్లో పలు చోట్ల చెట్లకు ఉయ్యాలలు కడతారు.యువతులను ఉయ్యాలపై ఎక్కించి వేగంగా ఊపుతారు. వేగాన్ని తట్టుకోలేక ఆపమని అడిగినపుడు మొగుడు పేరు చెప్తేనే ఆపుతామని అంటారు. అట్లతద్దె

నేడు అట్లతద్ది

రోజున యువతులు, వివాహితలు, కొత్తగా పెళ్లయిన వధువులు తెల్లవారుజామున నిద్ర లేచి గోంగూర పచ్చడి, పెరుగు అన్నంతో భోజనం చేస్తారు. అట్ల తద్దోయ్..ఆరట్లు ముద్దపప్పోయ్ మూడట్లు అంటూ పాడుతూ ఇరుగుపొరుగు స్నేహితురాళ్ళతో ఆడతారు. పెద్దలు కూడా ఉత్సాహంగా పాల్గొంటారు. వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. ధైర్యంగా వీధుల్లోకి వచ్చి ఆడుకోవడానికి పాడుకోవడానికి ఇదే వారికి మంచి తరుణం కాబట్టి పిల్లలతో బాటు తల్లులు కూడా వారితో వెళ్లి ఆటలాడతారు.

సౌభాగ్యం కోసం పూజ

వివాహమైన మహిళలు సౌభాగ్యం, సంతానం కోసం, వివాహం కానివారు మంచి భర్త కోసం అట్లతద్ది రోజున గౌరీదేవి పూజ చేస్తారు. పదకొండు అట్లు గుమ్మడి ఆకులో పెట్టి పద కొండు మంది ముత్తయిదువులకు వాయనాలు సమర్పిస్తారు. గోప్రదక్షిణలు చేసి గోమాతకు పూజలు చేస్తారు. చీకటి పడిన తరువాత చంద్రదర్శనం చేసుకొని స్నానమాచరించి గౌరీ



దేవికి పూజ చేస్తారు.చంద్రునిలో కొలువైన శక్తి వలన సౌభాగ్యం కల్గుతుందని, కుటుంబంలో సుఖశాంతులు కల్గుతాయం టారు.నవగ్రహాలలో కుజుడికి అట్లు ప్రీతి. అమ్మవార్కి అట్లు సమర్పించడం ద్వారా కుజ దోషాలు తొలగి శుభాలు కల్గుతాయని చెబుతారు.

పసిడి ధగధగలు

బంగారం ధర ఆల్‌టైం రికార్డు



నరసాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పసిడి ధర శుక్రవారం ఆల్‌టైం రికార్డు నమోదు చేసుకుంది. పది గ్రాముల మేలిమి బంగారం రూ.80 వేలకు చేరింది. అంటే గ్రాము బంగారం రూ.8వేలు పలికింది.ఇదే బులియన్ మార్కెట్‌లో ఆల్‌టైం హైధర. గడిచిన నాలుగేళ్లల్లో పోలిస్తే నూరుశాతం పెరిగింది. కోవిడ్ సమయంలో అంటే 2020లో పది గ్రాముల ధర రూ.40 వేలు ఉండేది. ఆ సమయంలో ఎవరి దగ్గర 50 కాసుల బంగారం ఉందో దాని విలువ నేడు 100 కాసులకు చేరినట్టైయింది. ఇటు బులియన్ మీద పెట్టుబడులు పెట్టిన వారి సంపద కూడా రెట్టింపు అయింది. అయితే ఈధర ఇక్కడతో ఆగదు.. ఇంకా పెరుగుతుందంటున్నారు బులియన్ వ్యాపారులు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే పసిడి ధర పెరుగుదలకు కారణంగా చెపుతున్నారు. ధర ఇదే విధంగా

నాలుగేళ్లలో 100 శాతం పెరుగుదల

2020లో పది గ్రాముల మేలిమి బంగారం రూ.40 వేలు

నేడు రూ.80 వేలు

పెరిగితే వచ్చే ఏడాది మార్చి నాటికి పది గ్రాములు రూ.90 వేలకు చేరవచ్చునని అంచనా వేస్తున్నారు. ధర ఆల్‌టైం రికార్డులను దాటిపోతుండటంతో బంగారం దాచుకున్న వారి ఆనందానికి హద్దులు లేకుండా పోతున్నాయి. మరోవైపు గతంలో కొనుగోలు చేద్దామని వెనుకంజు వేసిన వారిలో నిరాశ నెలకొంది. ఆ ధరలో కొని ఉంటే లాభం వచ్చి ఉండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ పసిడి ధర పెరుగుతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలింది. కనీసం గ్రాము బంగారం వస్తువు కొనాలంటే తరుగు, మజూరులతో కలిసి రూ.10 వేలు పట్టుకోవాల్సి వస్తుంది. ఇక రెండు గ్రాముల వస్తువు కొనాలంటే రూ.20 వేలు లేనిదే రాదు. పెరుగుతున్న ధరలను చూసి వస్తువులు కొనేందుకు కూడా కస్టమర్లు వెనకంజు వేస్తున్నారు.

పసిడికి పెట్టింది పేరు

జిల్లా పసిడి మార్కెట్‌కు పెట్టింది పేరు. నిత్యం కోట్లల్లో వ్యాపారం సాగుతోంది. అత్యధికంగా నరసాపురం మార్కెట్ ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్దది. నిత్యం ఇక్కడ పది కోట్లు పైనే వ్యాపారం ఉంటుంది. ఇక్కడ 100కు పైగా బులియన్ షాపులు ఉన్నాయి. రెండో స్థానంలో భీమవరం నిలిచింది. తరువాత స్థానంలో తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాలు ఉన్నాయి. ప్రస్తుతం ధర పెరుగుతుండటంతో సీజన్ అయినప్పటికీ షాపులన్నీ కళతప్పాయి. వెండి ధర కూడా పసిడితో పోటీ పడుతోంది. శుక్రవారం మార్కెట్‌లో కేజీ వెండి రూ.95 వేలు పలికింది. దీంతో పది గ్రాములతో చిన్న వస్తువు కొనాలన్నా రూ.12 వేలు లేనిదే రావడం లేదు. కనీసం పట్టీలు కొనాలన్న రూ.5 వేలు చూసుకోవాల్సిన పరిస్థితి. దీంతో తక్కువ గ్రేడ్‌తో వెండి వస్తువులు లేదా కోటింగ్‌తో కూడిన పట్టీలతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది.



గ్రాము రూ.20 వేలకు చేరవచ్చు

బంగారం మీద పెట్టిన పెట్టుబడి ఎప్పటికి నష్టం కలి గించదు. గడిచిన పదేళ్లలో ఇది రుజువు చేసింది. రానున్న రోజుల్లో కూడా ధర ఇదే విధంగా పెరుగుతుంది. ప్రపంచ దేశాలన్నీ బంగారాన్నే నిల్వ చేస్తున్నాయి. పెట్టుబడిదారులు కూడా దీనివైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో పసిడి ధర పెరుగుతూ వస్తుందే తప్ప తగ్గడం లేదు. 2035 నాటికి గ్రాము బంగారం రూ.20 వేలు అయినా ఆశ్చర్య పడనవసరం లేదు.



-అజిత్ కుమార్‌జైన్, బులియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

ధరల పెరుగుదల ఇలా..

సంవత్సరం	పది గ్రాములు
1910	రూ 15.50
1920	రూ 18.25
1930	రూ 18.05
1940	రూ.36
1950	రూ.99
1960	రూ.111.56
1970	రూ.184.50
1980	రూ.1330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.40,000

ఇల్లాగిపోయింది !

వెంటాడుతున్న ఇసుక సమస్య

మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్లు

పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు వలస

పోలవరం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన ఉంది భవన నిర్మాణ కార్మికులు, నూతన భవన నిర్మాణం చేసుకుంటున్న వినియోగదారుల పరిస్థితి. గోదావరి చెంతనున్నా ఇసుక ర్యాంపులు అందుబాటులో లేక అవస్థలకు గురవుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలచోట్ల ఇసుక కొరతతో పనులు నిలిచిపోయాయి. పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇతర పట్టణాలకు వలస పోతున్నారు.

పోలవరం ప్రాజక్టు నిర్మాణానికి ముందు పోలవరం మండలంలో గోదావరి నదీతీరం వెంబడి పోలవరం నుంచి తాడిపూడి వరకూ సుమారు 6 వందల ఎకరాల మేర ఇసుక తిన్నెలు ఉండేవి. స్పిల్వే నిర్మాణం తర్వాత నదీ ప్రవాహం మళ్ళింపు వల్ల నది దిశ మారి పోలవరం నుంచి తాడి పూడి వరకూ ఇసుక తిన్నెలు కొట్టుకు పోయి లంక భూముల వరకూ నది విస్తరించింది. దీంతో ఇసుక అవసరాల కోసం గత ఐదేళ్లుగా గోదావరిలో తూర్పుగోదావరి జిల్లా వైపు నుంచి పడవల ద్వారా డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక సరఫరా చేసేవారు. పోలవరం మండలంలో పోలవరం, పట్టిసీమ, గూటాల ర్యాంపులు మూత పడడంతో ఇసుక కొరత ఏర్పడింది. ఇసుక పాలసీ అమలులోకి వచ్చినా ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణం కోసం కొవ్వూరు నుంచి గతంలో కంటే అధిక ధరలకు తెచ్చుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇసుక బుకింగ్ కూడా క్లిష్టతరమై పోతుందని ఓపెన్ అయిన ఐదు నిమిషాలకే బుకింగ్ క్లోజ్ అయి పోవడం వలన ర్యాంపుల వద్ద బ్లాకులు కూడా నడుస్తున్నాయని, గతంలో 20 టన్నుల లారీ 17 వేల రూపాయలకు కొనుగోలు చేస్తే ఇప్పుడు బ్లాకులో అదనంగా 10 వేల రూపా యల వరకూ సొమ్ములు చెల్లించి కొనుగోలు చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. రేయింబవళ్ళు ఇసుక ర్యాంపుల వద్ద రోజుల తరబడి తమ బుకింగ్ వంతు కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు ఎదురవు తున్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. అవసరానికి ఎడ్లబండి ద్వారా స్థానిక పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి రవాణా చేస్తున్న గోదావరి ఇసుక బండి ఒక్కింటికి వెయ్యి రూపాయలకు, కాలువ ఇసుక బండి ఒక్కింటికి 800 రూపాయల వరకూ చెల్లించవలసి వస్తుందని అది కూడా ముందుగా ఆర్డర్ బుక్ చేసుకున్నవారికి మాత్రమే ఇసుక రవాణా జరుగుతుంది.

పోలవరం మండలంలో ఇసుక కొరత వలన భవన నిర్మాణ కార్మికులు నిత్యం రాజమహేంద్ర వరం జంగారెడ్డిగూడెం ప్రాంతాలకు వలస వెళ్ళి పనులు చేసుకుంటున్నారు. అధికారులు ప్రభుత్వం స్పందించి ఇసుక ర్యాంపులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇసుక కొరత లేకుండా చూడాలని భవన నిర్మాణ కార్మికులు, భవన నిర్మాణాలు తలపెట్టిన గ్రామస్థులు కోరుతున్నారు.



పోలవరంలో పునాదిలోనే ఆగిపోయిన ఇల్లు

ఉపాధికి గండి



ఇసుక కొరత వలన పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళవలసిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రయాణ ఖర్చులు, బోజన ఖర్చులు 300 రూపాయలు పోను వస్తున్న కూలి సొమ్ములు గిట్టుబాటు కావడం లేదు. ఇసుక కొరత వల్ల మా ఉపాధికి గండి పడింది.

- ధనాని అప్పారావు భవన నిర్మాణ కార్మికుడు

సగంలో ఆగిపోయాయి



ఇసుక కొరత, బుకింగ్ జాప్యం, బ్లాకు జరగడం, సమీపంలో ఇసుక ర్యాంపులు లేక పోవడం వంటి కారణాల వల్ల నిర్మాణాలు జరగడం లేదు. పెట్టుబడులు పెట్టి నిర్మాణాలు తలపెట్టిన ఇళ్లు మధ్యలోనే నిలిచిపోయాయి.

- బొట్టా శ్రీను, పోలవరం గ్రామస్థుడు

స్పోర్ట్స్ కాలమ్

అథ్లెటిక్స్‌లో మహాశ్రీకి బంగారు పతకం

ఏలూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో జరుగుతున్న 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలో ఏలూరుకు చెందిన లక్కోజు డింపుల్ మహాశ్రీ అండర్ -16 బాలికల విభాగంలో ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించింది. శుక్రవారం జరిగిన 600 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించింది. ఇటీవల రాజ మండ్రిలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకంతో పాటు బెస్ట్ అథ్లెటిక్‌గా ఎంపికై జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.



అండర్-14,17 విభాగాల్లో జిల్లా జట్టు ఎంపిక

దెందులూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్ అండర్- 14, 17 బాలురు, బాలికల క్రీడాపోటీల్లో కొవ్వలి జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థులు ఉమ్మడి జిల్లా జట్టుగా ఎంపికయ్యారని కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాలేజీ ప్రిన్సిపాల్ శర్మ తెలిపారు. ఈనెల 5వ తేదీన నుంచి 13వ తేదీ వరకూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జరిగిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన కొవ్వలి హైస్కూల్ క్రీడాకారులను ప్రిన్సిపాల్ శర్మ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గణేష్, ఉపాధ్యాయులు సుధారాణి , సురేష్, శ్రీనివాస రావు తదితరులు అభినందించారు,



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు నారాయణపురం విద్యార్థులు

ఉంగుటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు నారాయణపురం హైస్కూలు విద్యార్థులు అండర్-14, అండర్-17 పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం షేక్ మీరా సాహెబ్ వ్యాయామ ఉపాధ్యాయురాలు బేతాళ రాణి తెలిపారు. ఏలూరులో జరిగిన పోటీలలో 12 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బి.సత్య ప్రకాష్, ప్రకాశ్, శాంతకుమారి, లోహిత కుమారి, జి.మోక్షజ్ఞ, కుసుమ, బి.చిత్ర, అక్మల్, వి.లోకేష్, టి.శివదుర్గ, ఎం.శ్రీవల్లి, అంజలీదేవి ఎంపిక య్యారన్నారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం మీరా సాహెబ్

వాలీబాల్ పోటీలకు కైకరం విద్యార్థిని లిఖిత

ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతున్న పుప్పాల లిఖిత రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం హైస్కూలులో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చెర్మన్ అల్లూరి జగదీశ్వరి, ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగసుధ, పాపాయమ్మ, కుసుమ కుమారి విద్యార్థినిని అభినందించారు.



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలవపూడి విద్యార్థిని

కాళ్ళ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని మోహన శ్రీలక్ష్మి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈనెల 17న ఏలూరులో జరిగిన పోటీలలో ప్రతిభ చూపి విజయనగరం జిల్లాలో జరిగే అండర్-17 వాలీబాల్ పోటీలకు అర్హత సాధించింది. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రామ మోహన రావు, విద్యార్థినులను ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మంతెన పెద్ద నరసింహరాజు, సర్పంచ్ గేదల జాన్, ఉపవిద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎంఈవో వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం మూర్తి అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ప్రథమస్థానం సాధించిన నృత్య కళాకారులకు సత్కారం

భీమవరంటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతిలో కళలు ఒక భాగమని, 64 కళల్లో నృత్యం ఒకటని అందులో ప్రతిభ కనబరచడం అభినందనీయమని కేజీఆర్‌ఎల్ కళాశాల కార్యదర్శి మెంటే రామ మనోహర్, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. ఈనెల 13న హైదారాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సంగీత నృత్య సమ్మేళనంలో భీమవరం నృత్య కళాకారులు చిక్కడపల్లి త్యాగ రాజ గాన సభలో విశేష ప్రతిభ కనబరిచి ప్రథమస్థానం సాధించారు. కేజీఆర్‌ఎల్ కళా శాలలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తెలంగాణ నృత్య అకాడమీ నిర్వహించిన పోటీల్లో భీమవరం నుంచి ఆరుగురు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

రక్షిస్తారా.. !

పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో అవస్థలు

ఇరిగేషన్ క్వార్టర్స్‌లో నిర్వహణ

నేరస్తులను ఉంచే సెల్ కూడా లేదాయె

పెంటపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, కొట్లాటలు జరిగినా ఇక్కడకే వస్తారు తమ గోడు చెప్పుకుని న్యాయం చేయమని వేడుకుంటారు. అదే రక్షకభట నిలయం. అటువంటి రక్షక భట నిలయానికే కష్ట మెచ్చింది. పెంటపాడు పోలీస్‌స్టేషన్ సంవత్సరాల తరబడి సరైన గూడు లేక విలపిస్తున్నది. పెంటపాడు నుంచి భీమవరం వెళ్ళే ప్రధాన రహదారికి చేరువలో పెంటపాడు గ్రామ గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో అందరికి అందుబాటులో పోలీసుస్టేషన్ ఉండేది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఐదు సంవత్స రాల క్రితం పెంటపాడు బజార్ రోడ్డులో ఖాళీగా ఉన్న ఇరిగేషన్ క్వార్టర్స్‌లోకి పోలీస్‌స్టేషన్ మారింది. ఇది మారుమూల ప్రాంతం కావడంతో చాలా కాలం పోలీస్‌స్టేషన్ ఎక్కడ ఉందో నని వెతుక్కుంటూ వెళ్లేవారు.

నేరస్తులను బంధించేందుకు గది కూడా లేదు

కొత్తగా పోలీస్‌స్టేషన్ మార్చబడిన ఇరిగేషన్ క్వార్టర్స్‌లో కేవలం మూడు గదులు, ఒక హాల్ ఉంటాయి. ఒక గది ఎస్‌ఐకి, వేరొక గది రైటర్‌కి, మూడవ గది రిసెప్షన్‌గా కేటాయించారు. మధ్యలో ఉండే హాల్‌లో కంప్యూటర్ వర్క్ తదితర పనులు సాగిస్తున్నారు. ఇక ఆరు బయట ఒక టేబుల్, రెండు కుర్చీలు వేసుకుని పోలీస్‌స్టేషన్ వచ్చే బాధితులతో మాట్లాడుతూ ఉంటారు. నిందితులను ఉంచేందుకు ప్రధానంగా ఉండవలసిన సెల్ కూడా ఈ పోలీస్‌స్టేషన్‌లో లేదు. నేరస్తులు దొరికితే వారికి



సంకెళ్ళు వేసి వారిపక్కన కుర్చీ వేసుకుని ఒక కానిస్టేబుల్ నిరంతరం పహారా కాయాల్సిందే. సిబ్బంది పనులపై బయటకు వెళ్ళేప్పుడు కూడా ఆ పనులు మానుకుని నేరస్తులకు ప్రత్యేకంగా ఒకరు కాపలాగా కూర్చోవలసి వస్తుంది. పాత పోలీస్‌స్టేషన్ ఉండే స్థలం ప్రస్తుతం అడవిగా మారిపోయింది. స్థలం మొత్తం పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఆ స్థలంలో వివిధ కారణాలతో దొరికిన ద్విచక్ర మోటార్ సైకిల్స్, కార్లు ఉంచుతున్నారు. కొత్త పోలీస్‌స్టేషన్ భవనం నిర్మాణం జరగాలంటే పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ నుంచి నిధులు మంజూరు కావల్సి ఉంది. అయితే ఈ ఒక్క పోలీస్‌స్టేషన్ మాత్రమే కాదు. జిల్లాలోని కాళ్ళ, ఉండి తదితర మండలాలలో ఇదే తరహాలో పరాయి భవనాలలో పోలీస్‌స్టేషన్‌లు కొనసాగుతున్నాయి. కొత్త భవనాల కోసం ఎదురు చూస్తున్నారు.



యువజనోత్సవాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు జానపద గీతం అంశంలో కల్యాణ్, నవ్యశ్రీ బృందాలు ప్రతిభ కనబర్చాయి. కల్యాణ్ బృందం మొదటి స్థానంలో, నవ్య బృందం రెండో స్థానంలో నిలిచాయి. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొననున్నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకడమిక్ రత్నాకర్ విద్యార్థులను అభినందించారు.

క్రైమ్ కార్నర్

విజయవాడలో రోడ్డు ప్రమాదం

ఆకివీడు జనసైనికుడి మృతి.. వీరమహిళకు తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ వేణువర్ధన్

ఆకివీడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకివీడుకు చెందిన జనసైనికుడు మృతి చెందగా వీరమహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. స్థానిక మాదివాడకు చెందిన వీరమహిళ దున్నా నాగపూర్ణిమ, సాయిదుర్గ నగర్‌కు చెందిన జనసైనికుడు బళ్ళ వేణువర్ధన్ (21) విజయవాడ గుడికి గురువారం స్కూటీపై బయలుదేరి వెళ్ళారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై బల్లిపర్రు అడ్డరోడ్డు దగ్గరకు వెళ్ళే సరికి ఎదురుగా పెదమద్దాలికి చెందిన మెరుగుమాల వెంకటేశ్వరరావు (65) మోటారు సైకిల్‌తో ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందని పామర్రు ఎస్‌ఐ అవినాష్ తెలిపారు. వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా వేణువర్ధన్‌ను విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పూర్ణిమ కు తీవ్ర గాయాలయ్యాయి. పోస్టుమార్టం అనంతరం వేణువర్ధన్ మృతదేహం శుక్రవారం ఆకివీడు తీసుకు వచ్చారు. **ఆకివీడు జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు నివాళులు అర్పించారు.**

తాళం వేసిన ఇళ్లే టార్గెట్



- 15కుపైగా చోరీలు
- నరసాపురం రైల్వేస్టేషన్ వద్ద దొంగ అరెస్టు
- 71.47 గ్రాముల బంగారం స్వాధీనం

నిందితుడిని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న ఏఎస్పీ మురళీ కృష్ణ

నరసాపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్ళల్లో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడు మండెల నాగ భాస్కరరావును శుక్రవారం అరెస్టు చేసి, అతని వద్ద 71.47 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ నాదెండ్ల మురళీకృష్ణ చెప్పారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 1న నరసాపురం పట్టణంలోని 20వ వార్డులో నివాసం ఉంటున్న ఉమామహేశ్వరి నివాసంలో చోరీ జరిగిందన్నారు. 122 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి పోయినట్లు అక్టోబర్ 1న పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. దీని ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ఈ చోరీ పాత నిందితుడు నాగ భాస్కరరావు చేసినట్లు అనుమానం వచ్చిందన్నారు. అతని మీద నిఘా పెట్టి శుక్రవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు ఏఎస్పీ చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో సీఐ యాదగిరి, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి కీలకంగా వ్యవహరించారన్నారు.

ఇద్దరు పోలీసులతో నిందితుడికి స్నేహం...

ఇదిలా ఉంటే ఈ చోరీకి పాల్పడిన నిందితుడికి జిల్లాలోని ఓ సర్కిల్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్ళతో మంచి స్నేహం ఉంది. గతంలో పాలకొల్లులో ఓ చోరీ కేసులో నిందితుడ్ని పట్టుకుని విచారించినప్పుడు పోలీసులు నివ్వెరపోయారు. తనకు జిల్లాలోని ఓ సర్కిల్‌లో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లతో మంచి పరిచయం ఉన్నట్లు వెల్లడించడంతో పోలీస్‌లు అవాక్కయ్యారు. దీనిపై పోలీసులు విచారించగా ఈ ఇద్దరి కానిస్టేబుళ్ళు కోళ్లఫారం నిర్వహించే సమయంలో ఈ దొంగ వీరితో కలిసి ఉండేవాడని వెల్లడైంది. అయితే బిజినెస్‌లో భాగస్వామా...? లేక అందులో పని చేసేవాడా అన్నది బయటపడలేదు. గత ప్రభుత్వ హయాంలో సంచలనమైన ఈ కేసును కొందరు పోలీసులు బయటకు పొక్కనివ్వలేదు. అయితే ఎన్నికల సమయంలో విధుల్లోకి వచ్చిన ఓ సీఐ దీనిపై జిల్లా ఎస్పీకి ఒక రిపోర్టును సమర్పించారు. దొంగతో ఈ కానిస్టేబుళ్ళకు పరిచయాలు ఉన్నట్లు బయటపడినప్పటికీ ఈ ఇద్దరిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పోలీస్‌శాఖలో ఉంటూ చోరీలకు పాల్పడే నిందితుడికి ఆశ్రం కల్పించడం పెద్ద నేరం. పాత నేరస్థుడని తెలిసి అతనితో దోస్తీ చేయడం, చేసే వ్యాపారంలో ఉద్యోగం, వాటా ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం 15పైగా చోరీలకు పాల్పడిన ఈ నిందితుడిని పోలీసులు లోతుగా విచారిస్తే ఎన్నో విషయాలు బయటకొస్తాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ ఇద్దరు కానిస్టేబుళ్ళపై ఈ సర్కిల్‌లో ఎన్నో ఆరోపణలు ఉన్నాయి.

పేలిన మందుగుండు సామగ్రి

- ముగ్గురికి కాలిన గాయాలు
- డీఎస్పీ ఘటనా స్థలం పరిశీలన
- వీరమ్మకుంటలో ఘటన



పెదపాడు, అక్టోబరు 18 : బాణసంచా సామగ్రిలో వినియోగించే పేలుడు స్వభావం కలిగిన మందుకు ప్రమాదవశాత్తు నిప్పు రాజుకుని పేలడంతో ఆ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా, మరో ఇద్దరు కాలినగాయాల పాలైన ఘటన పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం స్థానిక ఆక్వా రైతు రెడ్డి అప్పారావు చెరువుపై నందివాడ మండలం, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కారనికోట పౌలు, సామర్లకోటకు చెందిన మర్రి సత్తిబాబులు పనిచేస్తున్నారు. వీరితో పాటుగా గ్రామానికి చెందిన మేకల సురేష్ ముగ్గురు కలిసి చెరువు మీద పక్షులను తోలేందుకు వినియోగించడానికి మందుగుండును రెడ్డి అప్పారావు ఇంటి వద్ద సిద్ధం చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు అంటుకుని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పౌలు తీవ్రంగా గాయపడగా, మిగతా ఇద్దరికి కాలిన గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. సమాచారం తెలియడంతో నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ కె.వెంకటేశ్వరరావులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిట్‌లో టెక్రియా 2కే24 వేడుకలు

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఇస్రో మొబైల్ బస్సు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఇస్రో మొబైల్ బస్సులో శాటిలైట్ నమూనాలు..



తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆవిష్కరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సోలార్ శాటిలైట్ వెహికల్, రాకెట్ వంటి పరికరాల నమూనాతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఇస్రో మొబైల్ బస్సు తదితర కార్యక్రమాల నడుమ ఏపీ నిట్‌లో టెక్రియా 2 కే 24 కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఒకరితో మరొకరు పోటీ పడుతూ ప్రదర్శించిన ఆవిష్కరణల స్టాల్స్ చూపరులను విపరీతంగా ఆకర్షించాయి. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అదరగొట్టారు.


బజ్వారి గేమ్ ఆవిష్కరణ

ఈఈఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో బజ్వారి గేమ్ ఆవిష్కరణ నిర్వహించారు. గదిలోని గోడలకు రెండు వైపులా ఎదురెదురుగా లేజర్ కిరణాలు పడేలా సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆటను ముగ్గురు వ్యక్తులు ఆడతారు. వారు లేజర్ కిరణాలకు తాకకుండా వెళ్ళాల్సి ఉంటుంది. ఎవరైనా లేజర్ కిరణాలకు తగిలితే శబ్దం వస్తుంది. అలా ముందుకు వెళ్ళిన వ్యక్తులు మైక్రో కంట్రోలర్ వద్ద ఏర్పాటు చేసిన పాస్‌వర్డ్ ను కొన్ని క్లూస్ సహాయంతో కనుక్కుని టైంబాంబును ఆపుచేయాల్సి ఉంటుంది. 10 నిమిషాల వ్యవధిలో ఎవరైతే టైం బాంబును నిలువరిస్తారో వారిని విజేతలుగా ప్రకటిస్తారు.

కెమికల్ విద్యార్థుల ఫ్లూయిడ్ మేజ్

కెమికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఫ్లూయిడ్ మేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది నాలుగు అంతస్తుల పైపు బిల్డింగ్. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి నాల్గవ అంతస్తు లోకి పైపుల ద్వారా నీటిని చేర్చాల్సి ఉంటుంది. అయితే పైపులకు మధ్యలో 12 వాల్వ్‌ను ఏర్పాటు చేస్తారు. వీటిలో ఎనిమిది వాల్వ్‌లు మాత్రమే సక్రమంగా పనిచేస్తాయి. పైపులను నిశితంగా పరిశీలించి ఏ వాల్వ్‌ని తిప్పితే నీరు పైపుల నుంచి పైకి వెళ్తుందో నిశితంగా పరిశీస్తూ వాల్వ్ ను తిప్పాలి. ఎవరైనా పొరపాటుగా తిప్పితే నీరు కిందకి వచ్చేస్తుంది. నాలుగు నిమిషాల వ్యవధిలో ఎవరైతే నీటిని వేగంగా నాల్గవ అంతస్తులోకి పంపిస్తారో వారిని విజేతలు ప్రకటిస్తారు. అలాగే ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో కార్‌రేస్, ఇస్రో మొబైల్ బస్సు ఆకట్టుకున్నాయి.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ దినేష్ శంకర రెడ్డి


యువతి నృత్య ప్రదర్శన


మాట్లాడుతున్న ఎన్టీయే నగరశాఖ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

మునిసిపల్ టీచర్లను మాతృ పాఠశాలలకు పంపాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవో 84 ఉత్తర్వులకు విరుద్ధంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో డిప్యూటేషన్లపై ఇతర యాజమాన్య పాఠశాలల్లో నియమించిన ఏలూరు మునిసిపల్ టీచర్లను తిరిగి వారి మాతృ పాఠశాలలకు వెనక్కిపంపేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని శుక్రవారం ఏలూరులో జరిగిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘ నగరశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమిక తరగతులు బోధించే టీచర్లకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను మండలస్థాయిలోనే నిర్వహించాలని కోరారు. రిటైరైన మునిసిపల్ టీచర్లకు పీఎఫ్ నగదును వెంటనే చెల్లించాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను పునఃపరిశీలించి తక్కువ రోల్‌వున్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు మార్చాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి ఉత్తర్వులు లేవు : డీఈవో

పాఠశాల విద్యాశాఖలోకి విలీనమైన మునిసిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, ఖాళాగా వున్న హెచ్‌ఎం పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీ చేయడానికి ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి ఉత్తర్వులు లేవని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. యూటీఎఫ్ జిల్లాశాఖఆధ్వర్యంలో గురువారం డీఈవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహదీక్ష చేయటంపై ఆయన శుక్రవారం వివరణ ఇచ్చారు. మునిసిపల్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించడానికిగాని, అప్‌గ్రేడ్‌చేసిన ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు కూడా ప్రభుత్వం ఇంతవరకు ఉత్తర్వులు జారీచేయలేదని స్పష్టం చేశారు.

టెట్‌కు 60 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షలకు శుక్ర వారం ఉదయం 185మంది అభ్యర్థులకు 162మంది, మధ్యాహ్నం 185 మందికి 148 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ దంపతుల పూజలు



భీమవరం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మను ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ గుండా నరసింహం దంపతులు శుక్రవారం నాడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి ఎంపీ వినతి


హైవే అథారిటీస్ చైర్మన్ సంతోష్ కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎంపీ

ఏలూరు టూటౌన్, అక్టోబరు 18: నేషనల్ హైవే సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌కు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని సంతోష్‌కుమార్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. 216ఎ, 365బీబీ, ఎన్‌హెచ్ 16పై అభివృద్ధి పనులు, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పామాయిల్ రైతుల కోసం లింగగూడెం, కమలాపురం, రాఘవపురంలో కన క్టివిటీ రోడ్డు నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. ఖమ్మం నుంచి దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే అభివృద్ధిలో భాగంగా పామాయిల్ వ్యవసాయ ఉత్పత్తులు తరలించడానికి కనక్టివిటీ రహదారి నిర్మించాలన్నారు. ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టు వెంబడి సర్వీసురోడ్డు నిర్మించాలన్నారు. ఖమ్మం, దేవరపల్లి ఎక్స్‌ప్రెస్‌వే, నిర్మాణంలో ఉన్న నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, చింతలపూడి మండలం గురుబట్లగూడెం నుంచి రేచర్ల, గుర్వాయిగూడెం వరకు సర్వీసు రోడ్లు మంజూరు చేయాలన్నారు. కొత్తగూడెం, సీతం పేటలో రోడ్లు నిర్మాణం చేపట్టినప్పటికి తక్షణ చర్యలు లేకపోవడం వలన ప్రజలు మృత్యువాత పడుతున్నారని అన్నారు. గుండుగొలను, దేవర పల్లి, కొవ్వూరు సెక్షన్‌లో విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఓవర్ బ్రిడ్జిపై సర్వీసురోడ్డు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వేఓవర్ బ్రిడ్జి, గుండుగొలను సర్వీసురోడ్డులో లైటింగును పెంచాలన్నారు. గుండుగొలను, భీమడోలు, కురెళ్ళగూడెం, పూళ్ళ, కైకరం, చేబ్రోలు, నారాయణపురం, పొంగుటూరు వరకు రెండు కిలో మీటర్ల ఫ్లైఓవరు సబ్‌వేలను నిర్మించాలన్నారు.

స్లాబ్ పెచ్చు తలపై పడి గాయాలు

మండవల్లి అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాడు జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల భవనం స్లాబ్ పెచ్చు ఊడి విద్యార్థిని తలపై పడి గాయపడింది. శుక్రవారం పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఘంట సాల జయశ్రీసత్య అనే విద్యార్థిని గాయపడడంతో కూటమి నాయకుడు ఎంకె, గ్రామస్థులు చిన్నారిని కైకలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో స్లాబు పెచ్చులూడి పడి పోతున్నాయని విద్యార్థులు భయం భయం గా విద్యాభ్యాసం చేస్తున్నారని, అధికారులు జోక్యం చేసుకుని మరమ్మ తులు చేయించాలని ఎంకే, గ్రామస్థులు కోరారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

కైకలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టర్ లెక్చరర్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీఎం దయాకర్ కోరారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత 20 ఏళ్లగా కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారంతా పసుపు రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో 114ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు పి. రవికుమార్, జాన్‌శేఖర్, రాయప్పరావు, భీమరాజు, జి రాజు, భానులక్ష్మి పాల్గొన్నారు.

22న ఐటీఐలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఆచంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆచంట గవర్నమెంటు ఐటీఐ కళాశాలలో ఈ నెల 22న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్య నారాయణరాజు తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ముత్తూట్ ఫైనాన్స్, డైకెన్ ఏసీ, ఎయిర్‌టెల్‌పేమెంట్ బ్యాంక్ వంటి కంపెనీల్లో కస్టమర్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, లోన్‌ఆపరేటర్, తదితర ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన పురుష మహిళ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాలకు సెల్‌నెం. 95735 28272, 63049 22617 లకు సంప్రదించాలని కోరారు.

టీచర్లకు 'సాల్ట్' సమస్య !

ఏలూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా కార్యక్రమాల్లో భాగంగా ఉపాధ్యాయులకు 'సాల్ట్' పేరిట విజయవాడలో ఈ నెల 21నుంచి 26 వరకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఇవ్వనున్న శిక్షణను నిలిపివేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో అబ్రహంను కలుసుకుని సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా టీచర్లను విజయవాడకు శిక్షణ నిమిత్తం హాజరుకావాలని ఆదేశించడం సరికాదన్నారు. ముందుగా రిసోర్స్ పర్సన్లకు శిక్షణనిచ్చి, వారితో జిల్లాల్లోని మండలకేంద్రాల్లో పాఠశాల పనివేళల్లో శిక్షణనిచ్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. డీఈవోను కలిసిన ఏపీటీఎఫ్ జిల్లానాయకుల్లో ఆనంద్ కుమార్, శ్రీనివాస్, కేదారేశ్వరస్వామి, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, పొట్టియ్య, వెంకటేశ్వరరావు, మూర్తి ఉన్నారు.

టీచర్లకు శిక్షణ తప్పనిసరి

విద్యావిధానం, బోధనా పద్ధతులు, పరీక్ష విధానం తదితర అంశాల్లో ప్రస్తుత మార్పులపై 'సాల్ట్' పేరిట ప్రభుత్వం రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులందరికీ 20 రోజుల పాటు శిక్షణ నివ్వాలని నిర్ణయించింది. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా దీనిని రాష్ట్రస్థాయిలో 6 రోజులకు కుదించి, మిగతా రోజులకు జిల్లాల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. మన రీజియన్‌కు సంబంధించి రాజమండ్రి, అగిరిపల్లిలో శిక్షణ ఉంటుంది. జిల్లాలోని 8320 మందికీ 'సాల్ట్' శిక్షణ ఉంటుంది. ఒక షిఫ్టు ట్రైనింగ్ వ్యవధి ముగిసిన తర్వాత మరో షిఫ్ట్‌కు శిక్షణ నిస్తారు. ఇందులో ఎవరికీ మినహాయింపులు ఉండవు. ఏపీటీఎఫ్ నాయకులు కోరిన విధంగా శిక్షణను మండలస్థాయిలో ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.' అని డీఈవో అబ్రహం వివరించారు.



పీఎంపీల జాతీయ ప్రధాన కార్యదర్శిగా వీబీటీ రాజు

గణపవరం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18: రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరిగిన కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లిగూడెంకు చెంది న వీబీటీ రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గణపవరంలో శుక్రవారం వీబీటీ రాజును జిల్లా నాయకులు అభినందించారు.

మార్చురీలో మృతదేహం మాయం చేస్తుండగా..

- అడ్డుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి
- విచారణకు ఆదేశించిన ప్రిన్సిపాల్



ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒక మృతదేహాన్ని తస్కరించగా మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి గుర్తించి అధికారులకు చెప్పడంతో వెంటనే ఆ మృతదేహాన్ని మళ్ళీ యథాస్థానంలో పెట్టేశారు. ఈ విషయాన్ని కొద్ది రోజుల పాటు ఆ విభాగానికి సంబంధించిన అధికారులు గుట్టు చప్పుడు కాకుండా దాచారు. ఆ తర్వాత చర్యలు చేపట్టారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో నాలుగు సంవత్సరాల క్రితం ఎలుకలు వచ్చి మృతదేహం కళ్ళు, కాలి వేళ్ళు తినేయడంతో రాష్ట్ర స్థాయిలోనే సంచలనం కలిగించింది. ఆ తరువాత ఏడాది క్రితం ఆ మార్చురీ వద్ద పోస్టుమార్టం చేయాలంటే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న సంఘటన వెలుగులోకి రావడంతో అక్కడ పనిచేసే ఔట్‌సోర్సు ఉద్యోగిని శాశ్వతంగా తొలగించారు. ఆ తర్వాత అంతా సవ్యంగానే కొనసాగుతుందన్న తరుణంలో ఇటీవల అక్కడ పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి (మార్చురీ అసిస్టెంట్) అర్ధరాత్రి వేళ ఒక మృతదేహాన్ని అంబులెన్సులో ఎక్కించుకుని తీసుకువెళ్తుండగా ఆ సమయంలో డ్యూటీలో ఉన్న ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగి (మార్చురీ అసిస్టెంట్) వెంటనే గుర్తించింది. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చింది. దీనితో మృతదేహాన్ని మార్చురీలో వదిలేశారు. చివరకు ఈ విషయంపై తర్జన భర్జన పడ్డ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని తస్కరించిన ఉద్యోగిని మార్చురీ నుంచి తొలగించి మెడికల్ కాలేజీలో ఉన్న మార్చురీ విభాగానికి పంపించారు. అయితే ఆ విభాగానికి చెందిన ప్రధాన అధికారి శుక్రవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు సిఫార్సు చేశారు.

మృతదేహాలు ఎవరికి అవసరం....

సాధారణంగా మృతదేహాలను మెడికల్ కాలేజీ లు కొనుగోలు చేస్తూ తమ ల్యాబ్‌లలో కెమికల్‌లో నిల్వ చేస్తూ ఉంటారు. ఆసుపత్రులలో ఎవరూ తీసుకువెళ్ళకుండా వదిలివేసిన అనాథ మృత దేహాలను సాధారణంగా అధికారికంగానే సొమ్ములను చెల్లించి తీసుకువెళ్తూ ఉంటారు. ఇప్పుడు మృత దేహాలు లక్షల రూపాయలు చెల్లిస్తే కాని పొందలేని పరిస్థితి ఉండడంతో అక్రమ మార్గంలో కొనుగోలు చేయాలని మొత్తం మీద ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ద్వారా రాయ బారాలు నడిపారా? మరే ఇతర ఉద్యోగులు ఎవరైనా బేరం కుదుర్చుకున్నారా.. అని చెప్పుకుం టున్నారు. అయితే ఆ ఉద్యోగి చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని అనాథ మృత దేహాలు మున్సిపల్ సిబ్బందికి అప్పగించి ఖననం చేయించారో లెక్క తేల్చాల్సి ఉంది. అంతేకాకుండా ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి మృత దేహాన్ని తస్కరించడానికి ప్రయత్నించిన ఆ ఉద్యోగికి ఎవరు సహకరించారో? ఏ వాహనాన్ని వినియో గించారు? మృత దేహాన్ని కొనుగోలు చేసేదెవరు? వంటి వివరాలు పోలీసు కేసు నమోదైతేనే దర్యాప్తులో వెలుగులోకి రానున్నా యని అంటు న్నారు. సీసీ కెమెరా పుటేజిలను పరిశీలించాల్సి ఉన్నది.

విచారణకు ఆదేశించాం : డాక్టర్ శశిధర్

ఈ సంఘటనపై ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్‌ను వివరణ కోరగా మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలోనే మార్చురీ నిర్వహణ ఉంటుందన్నారు. అక్కడ పనిచేస్తున్న అశోక్ అనే ఔట్‌సోర్సింగ్ మార్చురీ అసిస్టెంట్‌పై ఫోరెన్సిక్ విభాగం హెచ్‌వోడి డాక్టర్ భాస్కర్ రాతపూర్వకంగా శుక్రవారం ఫిర్యాదు ఇచ్చారన్నారు. పూర్తిస్థాయి విచారణ జరపాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను కోరామని ఆయన చెప్పారు.

రామ మందిర్‌లో చోరీ

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రామ మందిరంలో అర్ధరాత్రి వేళ బంగారు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. వన్‌టౌన్ రామకోటిలోని రామమందిర్‌కు ఈనెల 17వ తేదీ రాత్రి పురోహితుడు తాళాలు వేసి 18వ తేదీ ఉదయాన్నే వచ్చారు. వచ్చేటప్పటికి రామమందిర్ తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. పూజా విగ్రహాలకు ఉన్న 12 గ్రాముల బంగారు ఆభరణాలు వివిధ రకాల వెండి వస్తువులు కేజీన్నర, ఐదు వేల రూపాయల నగదును అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై రమేష్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. సంఘటనా స్థలాన్ని వన్‌టౌన్ సీఐ సత్య నారాయణ పరిశీలించారు. ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి) వచ్చి పరిశీలించారు.

కట్నం వేధింపులపై కేసు

యలమంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం నీలపూడి గ్రామానికి చెందిన తన భర్త శ్రీనివాస్, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన సారా రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.గురయ్య తెలిపారు

వివాహిత అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలల బాలింత అనారోగ్యానికి గురై ఆపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం భీమడోలులోని బీసీ కాలనీకి చెందిన బొలిశెట్టి నాగలక్ష్మి కుమార్తె భవానీ (19)ని ఏలూరు పత్తేబాద పార్కు పక్క నివాసముంటున్న రేమల్లె క్రాంతికుమార్‌కు ఏడాదిన్నరక్రితం ఇచ్చి వివాహం జరిపారు. మూడు నెలల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టింట్లో ఉన్న ఆమెను ఇటీవల తీసుకువచ్చారు. అనారోగ్యానికి గురైన ఆమెను ఈనెల 17వ తేదీ రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. మృత దేహాన్ని బంధువులకు ఇచ్చారు. అయితే ఆ మరణం పట్ల అనుమానం వ్యక్తం చేసిన భవానీ తల్లి నాగలక్ష్మి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి వైద్యుల బృందంచే శవపరీక్ష చేయించారు. అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు.





కైకరంలోశిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో శంకుస్థాపన చేస్తున్న నాయకులు

గ్రామీణ రహదారులకు ప్రాధాన్యం

పల్లె పండుగలో శంకుస్థాపనలు

ఉంగుటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎ.గోకవరం, కైకరం, తల్లాపురం, నీలాద్రిపురం, నాచుగుంట, సీతారాంపురం గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. సర్పంచ్‌లు మిద్దే సత్యవతి, నలగాల గోపి, పసుపులేటి నరసింహారావు, చదలవాడ రాజేంద్ర, బళ్ళ రాధ, పాతూరి విజయకుమార్, పంది రాంబాబు, చింతల శ్రీనివాస్, కాటి కిరణ్, వెజ్జు సుబ్బారావు, కోనా శ్రీనివాసరావు, చెన్ను సత్యవాణి, పంతుల వెంకన్నబాబు, కొరిపల్లి శ్రీనివాసరావు, పంచాయితీరాజ్ ఏఈ కృష్ణ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని నల్లూరి కృష్ణమోహన్, కరాటం సాయిబాబా అన్నారు. తాడితోట గ్రామం లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రతి పల్లెలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు.

● టి.నరసాపురం: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని, బండివారిగూడెం సర్పంచ్ నాళం టిరీషా అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీతం పేట నుంచి గంగినీడుపాలెం సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ టిరీషా, కాశీ దంపతులు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో పంచాయతీలు అభివృద్ధికి అడుగులు వేస్తోందన్నారు. గ్రామ కార్యదర్శి బి.నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.






పెదపాడు, దెందులూరు, కామవరపుకోట మండలాల్లో జరిగిన గ్రామసభల్లో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

పెదపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేపై గ్రామసభలను నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీటీ కె.సునీత తెలిపారు. వేంపాడులో శుక్రవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మరీదు రెడ్డియ్య, సర్వేయర్ కోదండరాం, వీఆర్వోలు కోటేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

● దెందులూరు: మేదినరావుపాలెంలో తహసీల్దార్ సుమతి, ఆర్ఐ హేమామాలిని, సర్వేయర్, వీఆర్వో బృందం గ్రామసభ నిర్వహించారు. 8 మంది నుంచి వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు,

● కామవరపుకోట: రైతుల వినతులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని తహసీల్దార్ గెద్దం ఎలీషా అన్నారు. ఖైసన్నగూడెం రైతులతో గ్రామసభ నిర్వహించి వినతులు స్వీకరించారు. సర్వేయర్ కాత్ర లత, కార్యదర్శి బి.రత్నకుమారి, వీఆర్వో కె.ప్రభాకరరావు, డాకూరి ఆశీర్వాదం పాల్గొన్నారు.

● చింతలపూడి: గున్నేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఏడు దరఖాస్తులువచ్చాయి. భూమి కొలతల తేడా, రెండు మ్యూటేషన్ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ డీఎల్. ప్రమద్వర తెలిపారు. గ్రామంలో ఒక దారి సమస్యపై ఒక దరఖాస్తు వచ్చిందని తెలిపారు.

● లింగపాలెం: మల్లేశ్వరంలో గ్రామసభలో వచ్చిన సమస్య పరిష్కరించామని తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు. ఉప సర్పంచ్ బొంతు రాంబాబు, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

● భీమడోలు: పోలసానపల్లిలో గ్రామసభకు సర్పంచ్ షేక్ హసీనారహీమాబేగమ్ అధ్యక్షత వహించారు. రీసర్వేపై ఐదుగురు దరఖాస్తు చేసినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు.



రతన్ టాటాకు భారతీయుడి నివాళి

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు నివాళి అర్పిస్తూ జాతీయ రహదారి కూడలిలో నారాయణపురం వద్ద భారతీయుడు పేరుతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పలువురిని ఆకర్షిస్తోంది. మండలంలోని కైకరం గ్రామానికి చెందిన వెజ్జు సుబ్బారావు ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. - ఉంగుటూరు



నాదెండ్లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

నాదెండ్లను కలిసిన నేతలు

ఏలూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఎంపీపీ పెనుమచ్చ శ్రీనివాసరాజు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి తదితరులు అమరావతిలోని సచివాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఏలూరు ఎంపీపీ శ్రీనివాసరాజు వైసీపీని వీడి గురువారం జనసేన పార్టీలో చేరారు. నాదెండ్లను కలిసి మండలంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు అందేలా కృషిచేయాలని సూచించారని ఎంపీపీ శ్రీనివాసరాజు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో దెందులూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి తాతపూడి చందు ఉన్నారు.

పరిమి సత్యనారాయణ రైతు నేస్తం అవార్డుకు ఎంపిక

ఉంగుటూరు, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): వెల్లమిల్లి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు పరిమి సత్యనారాయణ రైతు నేస్తం-2024 పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 20న కృష్ణా జిల్లా ఆత్కూరులో స్వర్ణ భారత్ ట్రస్టులో జరిగే కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి అవార్డు అందుకోనున్నారు.

వ్యాస రచన పోటీలలో కావ్యశ్రీకి ద్వితీయ బహుమతి

ఉంగుటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం శ్రీ వివేకానంద జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గొంతిన కావ్యశ్రీ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ద్వితీయ స్థానం పొందింది. జిల్లా విద్యాశాఖ అధికారులు రూ.3వేల నగదు, ప్రశంసాపత్రం అందించారు. హైస్కూలు హెచ్‌ఎం షేక్ మీరా సాహెబ్, గైడ్ టీచర్ గొల్లపల్లి రామారావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

గిరిజనుల సాగులో ఉన్న భూమిపై హక్కులు కల్పించాలి

పోలవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించాలని సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. వింజరం లో శుక్రవారం జరిగిన సభల్లో తహసీల్దారు సాయిరాజుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి బొరగం భూచంద్రం, మండల కమిటీ నాయకులు మడివి చలపతి, మిడియం దేవరాజు, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల కట్టడికి చర్యలు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో దొంగతనాల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి పోలీసులకు సూచించారు. పేరయ్య కోనేరు రామకోటి ప్రాంగణంలోని శ్రీరామమందిరంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎమ్మెల్యే చంటి శుక్రవారం ఉదయం ఆలయాన్ని సందర్శించారు. మరలా దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి బంగారు మంగళసూత్రాలు, వెండి వస్తువులు చోరికి గురయ్యాయని అన్నారు. కేసు నమోదు చేసి దొంగల్ని పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో కొట్టు మధువెంకట్రావు, కొట్టు మనోజ్, బచ్చు మురళీకృష్ణ, చోడే బాలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, పాల్గొన్న విద్యార్థినులు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా వల్ల అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల మనోవేదనతో కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యల జరగడంతో ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేశాయన్నారు. విద్యార్థులు పోలీస్ కేసుల్లో ఉంటే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయ సాధనకోసం చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆన్‌లైన్‌లో లోన్లు తీసుకుని వారు డబ్బులు కట్టినా ఇంకా డబ్బులు కట్టాలని బెదిరింపు కాల్స్, అసభ్య పదజాలాలతో ఫోన్ కాల్స్ ఇలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు విరోధంతో ఫోన్‌నెంబర్లను కాల్‌గర్ల్స్ వెబ్‌సైట్లో పెడుతున్నారని, ఇలా ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ పి సత్యనారాయణ, మెడికల్ కాలేజీ హెచ్‌వోడీలు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




పెదవేగి హైస్కూల్‌లో మాట్లాడుతున్న సీఐ పెదపాడులో విద్యార్థుల ప్రతిజ్ఞ

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

పెదపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈవో - 2 దేవినేని వెంకటరమణ అన్నారు. బాల్య వివాహాల కలిగే అనర్థాలను వివరిస్తూ జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్.ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వెంటనే సమీపంలోని అధికారులకు లేదా 112, 1098 నెంబరుకు తెలియజేయాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సూపర్‌వైజర్లు వీరకుమారి, మంగాదేవిల ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

● నిడమర్రు: బాల్య వివాహాలను కట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చని పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాల హెచ్ఎం పీవీ.సత్యనారాయణ అన్నారు. ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీలు, ఉపాధ్యాయులు పాలొన్నారు.

● పెదవేగి: చట్టాలు, వాటి ఉపయోగాలపై అవగాహన ఉంటే సమస్యలకు పరిష్కారం కనిపిస్తుందని సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్ఎంసీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలను తెలుసుకోవాలన్నారు. ఎస్ఐ కె.రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, సీహెచ్.అవినాష్‌రాజు, హెచ్‌ఎం నాగేంద్ర, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి : ఏఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు అన్నారు. అమీనాపేటలో సురేష్‌చంద్ర ఇంగ్లీషు మీడియం పోలీస్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఏఎస్పీ సూర్య చంద్రరావు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా వ్యవస్థ రాకతో విద్యలో అనేక మార్పులు సంభవించాయన్నారు. వంద శాతం మార్కులు వస్తేనే సంపూర్ణమైన విద్యనభ్యసించినట్లు కాదని, 40 శాతం మార్కులు వచ్చిన విద్యార్థులు ఎక్కువ పరిజ్ఞానం కలిగి ఉంటారన్నారు. తల్లిదండ్రుల తరువాత విద్యార్థులు ఎక్కువ సమయం గురువుల వద్దే ఉంటారని, గురువుల వద్ద తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు.

ఉపాధి పనులతో గ్రామాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమ్య

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ తాతా రమ్య అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి పనులను గుర్తించడం జరిగిందన్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పనులు ప్రారంభించారని, మిగిలిన గ్రామాల్లోకూడా పనులు ప్రారంభించి, కూలీలకు పూర్తిస్థాయి పనులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు ప్రగతిని వివరించారు. సమావేశంలో తహసీల్దారు ఎస్.భ్రమరాంబ, వైస్ ఎంపీపీ మేడికొండ ఉమాదేవి, ఈఓపీఆర్డీ షరీఫ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతమైన భోజనాన్ని అందించాలని, మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మరింత పెరగాలని మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలని రత్న ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఏలూరు కస్తూరిబా మున్సిపల్ పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, ఫోర్టు మోడల్ స్కూలులో మధ్యాహ్న భోజనం, మంచినీటి సదుపాయం, పరిసరాల పరిశుభ్రతను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోర్టుమోడల్ స్కూలులో ఉపాధ్యాయుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు గుణాత్మక విద్య, నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయులు పిల్లల చదువుతో పాటు ఆరోగ్యం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి చూపాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినా, సరైన వసతులు కల్పించకపోయినా ఆకస్మిక తనిఖీలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని రత్నప్రసాద్ హెచ్చరించారు.



ఏలూరులో విద్యుత్ సౌధ, బుట్టాయగూడెంలో సీపీఎం నేతల ధర్నా

విద్యుత్ చార్జీల భారంపై సీపీఎం నిరసన

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రూఆఫ్, సర్దుబాటు పేరుతో కరెంటు చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ఆర్‌పేటలోని విద్యుత్ సౌధ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిశోర్ మాట్లాడుతూ కరెంటు చార్జీలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా ఉన్నాయన్నారు. అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లను, రైతులు, విద్యుత్ గృహ వినియోగదారులపై బలవంతంగా రుద్దాలని చూస్తున్నారని విమర్శించారు. బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, వైఎస్.కనకారావు, జి.శారద, కంది విశ్వనాథం, జి.ఏసుబాబు, ఎం.ఇస్సాకు, జి.శివకుమార్, మీసాల సత్యం, సత్తిరాజు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ట్రూఅప్ చార్జీల పేరుతో పేదలపై భారం వేయడాన్ని నిరసిస్తూ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉచిత కరెంట్ ఇస్తామంటూ పేదలపై భారాలు మోపడం ప్రభుత్వానికి తగదన్నారు. తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు, అందుగుల ఫ్రాన్సిస్, మొడియం నాగమణి, తామా ముత్యాలమ్మ, ఉడతా వెంకటేష్, కారం భాస్కర్, చంద్రూ బుల్లెమ్మ, వెట్టి వీరయ్య పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

నిడమర్రు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపు తనిఖీలలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రేషన్ దుకాణాల్లో నిడమర్రు సివిల్ సప్లయ్ డీటీ జరీనా బేగం శుక్రవారం తనిఖీ చేశారు. పెద నిండ్రకొలను రేషను దుకాణంలో 4.400 కేజీలు బియ్యం ఉండాలి. కానీ కేవలం 421 కేజీల బియ్యం మాత్రమే ఉన్నాఇ. డీలర్ మదిరాల రామారావుపై 6 (ఎ) కేసు నమోదు చేశారు. చిననిండ్రకొలను దుకాణంలో 1320 కేజీల బియ్యానికి కేవలం 264 కేజీలు మాత్రమే ఉన్నాయి. డీలర్ యు.అప్పలరాజు వారిపై 6 (ఎ) ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం : ఇద్దరికి తీవ్ర గాయాలు




పిచ్చి కుక్క దాడిలో గాయపడిన ఏసోబు, రవి

పెదవేగి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క స్వైర విహారంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గార్లమడుగులో యంత్రపాటి ఏసోబుపై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసింది. అతని చేతి వేలికి తీవ్ర గాయమైంది. కాలి పిక్క కండను పీకేసింది. అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడు చొదిమెళ్ళ రవిపై దాడి చేయడంతో ముఖం, చాతిపై తీవ్రగాయాలయ్యాయి. అంతకుముందు పొలాల్లో పాడిపశువులు, మేకలతోపాటు ఇతర కుక్కలపై దాడిచేసింది. తర్వాత గ్రామంలో స్వైరవిహారం చేయడంతో గ్రామస్తులు ఆ కుక్కను కొట్టి చంపేశారు. రవి ముఖంపై నాలుగుచోట్ల తీవ్ర గాయాలు కాగా, ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుడి కంటికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారని గ్రామస్తులు తెలిపారు. పిచ్చి కుక్కలతోపాటు ఊరి కుక్కలు దాడిచేసి పాడి పశువులు, మేకలను గాయపరుస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కుక్కలు పిల్లలపై దాడికి తెగబడుతున్నాయని, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

టీడీపీ నేత పక్కాల వెంకటేశ్వరరావు మృతి



చింతలపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీస్ బాబాయిగా చిరపరిచితమైన టీడీపీ పట్టణ అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. 1976లో ఆయన పోలీస్ ఉద్యోగంలో చేరి ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పనిచేస్తూ 2012లో ధర్మాజీగూడెంలో ఏఎస్ఐగా రిటైర్ అయ్యారు. సేవా కార్యక్రమాలు చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా పనిచేశారు. 18 ఏళ్లుగా అయ్యప్ప అన్నదాన చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి మాల ధరించిన స్వాములకు ఉచిత అన్నసమారాధన ఏటా నిర్వహిస్తున్నారు. తెలుగుదేశంలో సామాన్య కార్యకర్తగా చేరి పట్టణ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. నియమితులై ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కు మార్తెలు ఉన్నారు. ఆయన పార్థివదేహాన్ని టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, మాటూరి వెంకట్రామయ్య, చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, కోనేరు సుబ్బారావు, ఘంటా సుధీర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, సీపీఎం, సీపీఐ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఎంపీ పుట్టా మహేష్ సంతాపం

పక్కాల వెంకటేశ్వరరావు మృతి బాధాకరమని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అంకిత భావంతో పనిచేశారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పశువుల సంరక్షణ లక్ష్యంగా పనిచేయాలి

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు పాడి ఆధారంగా జీవనం సాగిస్తుంటారని, పశువుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పశు సంవర్ధకశాఖ సంచాలకుడు టి.దామోదర్‌నాయుడుకు సూచించారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ను శుక్రవారం కలిసిన దామోదర్ నాయుడు పశువుల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు. పశుసంవర్ధకశాఖలో వైద్యులు, సిబ్బంది ఖాళీలు ఉన్నాయని, పశువులకు సమయానికి, సరైన వైద్యం అందక రైతులు నష్టపోతున్నారన్నారు. పశువులకు బీమా సౌకర్యం, పశువుల మేత రాయితీపై అందించే ఏర్పాటు చేయాలని ఆయన వివరించారు. దీంతోపాటు మినీ గోకులాలు మరిన్నింటిని దెందులూరు నియోజకవర్గానికి కేటాయించేలా సహకరించాలని ప్రభాకర్, దామోదర్ నాయుడును కోరారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ పోలీసులు విధించిన చలానాలను వెంటనే కట్టాలని ట్రాఫిక్ ఎస్ఐ టీఎస్ రంగారావు, సార్జంట్ కె.వెంకటేష్ అన్నారు. ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీలు ప్రారంభించారు. చలానాలు, జరిమానా ఉన్న వాహనాలను ఆపి అప్పటికప్పుడే ఆన్‌లైన్ ద్వారా సొమ్ము కట్టించారు. 13 కేసులలో రూ. 3,620 కట్టించారు. ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలకు ట్రాఫిక్ చలానాలు ఉన్నాయో లేదో తనిఖీ చేయించుకోవాలని, ఉంటే ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. తనిఖీల్లో పట్టుబడితే మార్గ మధ్యలోనే వాహనాలను ఆపి కట్టించడం జరుగుతుందన్నారు. కట్టకపోతే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

'ఓపెన్' టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాలయం (అపోస్) దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు గడువు ఈ నెల 25వరకు పొడిగించినట్లు డీఈవో అబ్రహం శుక్రవారం తెలిపారు. పెనాల్టీ రూ.200తో 29వరకు, పెనాల్టీ రూ.500తో ఈ నెల 31వరకు అడ్మిషన్లకు గడువు ఉందన్నారు. ఏపీ ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందాలని సూచించారు.

ప్రొఫెసర్ సాయిబాబా కుటుంబాన్ని ఆదుకోవాలి

చింతలపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిడపర్తి ముత్తారెడ్డి విజ్ఞప్తి చేశారు. సాయిబాబాపై అక్రమ కేసులు బనాయించి జైలుశిక్ష అనుభవించేలా చేశారని, కోర్టు తీర్పుతో విడుదలైన ఆయన అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని, ఆయనకు భార్య, కూతురు ఉన్నారని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఏజెన్సీలో మద్యం దుకాణాలను గిరిజనులకే ఇవ్వాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో మద్యం దుకాణాలను స్థానిక గిరిజనులకే కేటాయించాలని సీపీఎం నాయకుడు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్ డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసినా ఉల్లంఘనలు జరిగాయన్నారు. ఏజెన్సీ మద్యం షాపుల కేటాయింపులను రద్దు చేయాలని కోరారు. ఏజెన్సీలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలా? వద్దా? అనేది పెసా గ్రామసభ సమక్షంలో మెజార్టీ ఓటింగ్ ద్వారా నిర్ణయించాలన్నారు.

మునగాకు పోషకాహారం

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆరోగ్యాన్ని పరిరక్షించే మునగాకు ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని సీడీపీవో ఎ.పద్మావతి అన్నారు. జాలిపూడి, హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, మహిళలతో శుక్రవారం సమన్వయ సమావేశాలను నిర్వహించారు. మునగాకు మంచి పోషకాహారమని వివరించారు. మునగాకుతో తయారు చేసిన ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు సత్య, జోషి, అంగన్‌వాడీలు సీహెచ్.అ నంతలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** మిషన్ వాత్సల్య కార్యక్రమంలో పలు పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ తెలిపారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** సత్రంపాడు సౌభాగ్యలక్ష్మీదేవి, అంబికాదేవి ఆలయాల వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులతో సామూహిక పూజలు జరిపించారు.
- **పెదపాడు :** చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కుళ్లిన చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై శారద సతీష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- **దెందులూరు :** నాగులదేవునిపాడులో అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన నందేటి ఏసమ్మకు ఫాదర్ ఇంటి జేవీఆర్ నిత్యావసర సరుకులు, సామగ్రి, ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
- దెందులూరు మండల దేవదాయ శాఖ ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఎస్ నేహ నియమితులయ్యారు.
- **ఉంగుటూరు :** బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ శనివారం చేబ్రోలులో పర్యటిస్తారు. బీజేపీ సభ్యత్వాల నమోదు, కేంద్ర పథకాలపై లబ్ధిదారులతో సమీక్షిస్తారని రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి తెలిపారు.
- **పోలవరం :** పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాల ఆవరణలో గోడ పత్రికను ఆవిష్కరించారు. బి.వినోద్, జి.సుబ్రమణ్యం, ఎం.రాజు, జి.కళ్యాణ్, పాల్గొన్నారు.
- **భీమడోలు :** ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు ఉంచరాదని వైద్యురాలు మహేశ్వరి సూచించారు. భీమడోలులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.
- **కుక్కునూరు :** ఆదివాసీలను పాలకులు పట్టించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. బరపటినగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

అల్లుకున్న తీగల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్లుకుపోతున్న తీగలు.. ఒరిగిపోతున్న స్తంభాలు శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ముసునూరు తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని విద్యుత్ లైన్‌కు అల్లుకుపోయిన తీగెజాతి మొక్కలతోపాటు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను సైతం లైన్‌మన్ రమేష్, సిబ్బంది తొలగించారు. ఇన్‌చార్జ్ ఏఈ వీరబాబు మాట్లాడుతూ త్వరలో ఒరిగిన స్తంభాలను సైతం సరిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

కైకలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టర్ లెక్చరర్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీఎం దయాకర్ కోరారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారంతా పసుపు రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో 114ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

స్లాబ్ పెచ్చు తలపై పడి విద్యార్థినికి గాయాలు

భయం భయంగా చదువులు

మండవల్లి అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం స్లాబ్ పెచ్చు ఊడి విద్యార్థిని తలపై పడి గాయపడింది. శుక్రవారం పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఘంటసాల జయశ్రీసత్య అనే విద్యార్థిని గాయపడడంతో కూటమి నాయకుడు ఎంకె, గ్రామస్థులు చిన్నారిని కైకలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో స్లాబు పెచ్చులూడి పడిపోతున్నాయని విద్యార్థులు భయం భయంగా విద్యాభ్యాసం చేస్తు న్నారని, అధికారులు జోక్యం చేసుకుని మరమ్మ తులు చేయించాలని ఎంకే, గ్రామస్థులు కోరారు.

ఆందోళనకు సంఘాలు సిద్ధం

ముదినేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముదినేపల్లిలో గురువారం ఎన్‌హెచ్ అధికారులు అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన తీరుపై నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు విగ్రహ నిర్మాణ కమిటీ నాయకులు, మాలమహానాడు నాయకులు సిద్ధమవుతున్నారు. అంబేడ్కర్‌ను అవమానించేరీతిలో అధికారులు విగ్రహాన్ని తొలగించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవరణలో నిలబెట్టడంపై నాయకులు మండిపడుతున్నారు. దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ శనివారం ముదినేపల్లిలో ధర్నా నిర్వహిస్తామని విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ భిక్షాలు, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు భూపతి రవీంద్రబాబు తెలిపారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

ఆగిరిపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని జాతీయ అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ అన్నారు. తోటపల్లి హీల్ పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన చెకుముకి సైన్స్ సంబరాలులో ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ బి.సాయిబాబు, అథ్లెటిక్స్ కోచ్ శ్రీనివాసరెడ్డి, హీల్ అంధ పాఠశాల ఇన్‌స్పెక్టర్ ఎస్.రుష్మంత్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

మండవల్లి/కైకలూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలో శుక్రవారం భారీ వర్షం కురి సింది. పీహెచ్‌సీ ఆవరణ నీటితో నిండిపోయింది. రోగు లు అవస్థలు పడ్డారు. కైకలూరు పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కైకలూ రు-కలిదిండి ఆర్‌అండ్‌బీ రోడ్డులోని రైల్వే గేటుకి రువైపులా వర్షపునీరు భారీగా చేరింది.

క్రైం సమాచారం..

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై ఎస్‌ఐ చిరంజీవి శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆయన వివరాల ప్రకారం దెందులూరు మండలం దోసపాడు గ్రామానికి చెందిన పైడిమాల ప్రేమ్‌కుమార్ (26), మాధురి భార్యాభర్తలు. వీరు ఈ నెల 12వ తేదీన కాట్రేనిపాడులో మాధురి పుట్టింటికి వచ్చారు. అయితే 14వ తేదీ ఉదయం ప్రేమ్‌కుమార్ దోసపాడు వెళ్తున్నానని బయల్దేరాడు. మరుసటి రోజు మాధురి దోసపాడు వెళ్ళగా భర్త కనిపించకపోవడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరస్పరం దాడులు

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల బుక్ కీపర్ తొలగింపు విషయంలో ఇరు రెండు వర్గాల మధ్య జరిగిన పరస్పర దాడుల ఘటనపై ముసునూరు పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం కాట్రేనిపాడుకు చెందిన పెదగార్ల స్వరూపరాణి, సీమోనులకు అమర్తల శ్రీలక్ష్మీ, ప్రభుల మధ్య బుక్ కీపర్ తొలగింపుపై ఈ నెల 16వ తేదీ రాత్రి గొడవపడి కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో గాయపడిన ఇరువర్గాల వారు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఇరువర్గాలకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శులే..

ముదినేపల్లి మండలంలో పంచాయతీలు -32.. కార్యదర్శులు - 15 మందే!



ముదినేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు మళ్లీ ఇన్‌చార్జీ కార్యదర్శుల ఏలుబడిలోకి వెళ్లిపోయాయి. సాధారణ బదిలీల పర్వం ముగిశాక ముదినేపల్లి మండలంలోని 32 పంచాయతీలకు 15 మంది రెగ్యులర్ కార్యదర్శులు మిగిలారు. మండల కేంద్రమైన ముదినేపల్లికి కూడా ఇన్‌చార్జ్ కార్యదర్శుల గతి పట్టింది. ఈ పంచాయతీల్లో ఇన్‌చార్జ్ కార్యదర్శి పాలన ఏళ్ల తరబడి సాగు తూనే ఉంది. గ్రామ సచివాలయ కార్యదర్శులను పలు పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులుగా నియమించినప్పటికీ మండలం లోని 17 పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులే అదనపు బాధ్యతలతో వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క రెగ్యులర్ కార్యదర్శి అదనంగా రెండు నుంచి మూడు పంచాయతీల కార్యదర్శుల బాధ్యతలను నిర్వహించాల్సి వస్తుంది. అల్లూరు, దేవపూడి, ప్రొద్దువాక, పెయ్యేరు, దాకరం, సింగరాయపాలెం, కోమర్రు పంచాయతీల కార్య దర్శులు అదనంగా మరో పంచాయతీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, వడాలి, కొరగుంటపాలెం పంచా యతీల కార్యదర్శులు అదనంగా 3 పంచాయతీలు, ఊటుకూరు, కోడూరు పంచాయ తీల కార్యదర్శులు అదనంగా 2 పంచాయతీలకు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో పంచాయతీల కార్యదర్శులకు పని భారం పెరిగింది. ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. పంచాయతీల్లో పరిపాలన కుంటు పడే అవకాశం ఏర్పడింది. రెగ్యులర్ కార్యదర్శి లేక పోవటంతో సిబ్బందిపై అజమాయిషీ, పర్యవేక్షణ కూడా కొరవడింది. ఇటీవల ఇతర జిల్లాల నుంచి ప్రమోషన్లతో ముదినేపల్లి మండలానికి పంచా యతీ కార్యదర్శులుగా బదిలీపై వచ్చిన వారు విధుల్లో చేరిన కొద్ది రోజులకే తిరిగి తమ సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. వేరే కార్యదర్శిని నియ మించకుండానే అధికారులు వారిని రిలీవ్ చేయటంతో ముదినేపల్లి మండలంలో కార్యదర్శులు కొరత ఏర్పడింది.




గోపవరం.. భాస్కరరావు పేట గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలు

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కైకలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు అన్నారు. శుక్రవారం కైకలూరు మండలం గోపవరం, రాచపట్నం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు ఆలూరి నానిబాబు, వీర వల్లి శ్రీను, రాజులపాటు పాండు, నాగనబోయిన రమేష్, ఈదా వెంకటస్వామి, మోదుగుమూడి లక్ష్మయ్య, వాసిపల్లి సతీష్‌కన్నా, సర్పంచ్‌లు ఉలిసి వసంత కుమారి, అల్లూరి మంగారావు పాల్గొన్నారు.

కలిదిండి: పల్లె పండుగతో పల్లెల్లో రహదారులకు మహర్దశ వచ్చిందని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అన్నారు. శుక్రవారం భాస్కరరావు పేటలో రూ.36.85 లక్షలతో, మూల్లంకలో రూ.24.70 లక్షలతో నిర్మించే సీసీ రహదారులకు సర్పంచ్‌లతో కలసి శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు మంతెన సుబ్బ రాజు, వేగిరెడ్డి చిన్నారావు, భాస్కరరావుపేట సర్పంచ్ గద్దె ఆనంద్ కుమార్, మూల్లంక సర్పంచ్ మహదేవ విజయ బాబు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్, ఏపీవో ఆనంద్, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలోని వైవాక, ఊటుకూరు, ప్రొద్దువాక, అల్లూరు, కొర గుంటపాలెం, పెదగొన్నూరు గ్రామాల్లో సుమారు రూ. కోటి వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూటమి నాయకులు, సర్పంచ్‌లు శంకుస్థాపన చేశారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, సర్పంచ్‌లు పద్మావతి, వరలక్ష్మి, శీలం రామకృష్ణ, తాడంకి శిరీష, కూటమి నాయకులు పోసిన పాండు రంగారావు, వీరంకి వెంకటేశ్వరరావు, దావు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: అల్లినగరంలో శుక్రవారం పల్లెపండుగ నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆర్‌అండ్‌బీ రహదారి భూమి పూజ చేశారు. కూటమి నాయకులు బోయిడి సురేష్, ఎం. సత్తిబాబు, నారగాని నాగేశ్వరరావు, కమతం నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో విజయవాడలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ముసునూరు మండలం గుడిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నిర్మలా దేవి తెలిపారు. అండర్-14 విభాగంలో ఝాన్సీ, శ్రావణిలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు బాలికలను గ్రామ ప్రముఖులు రాయంకుల రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

కలిదిండి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస్ తెలిపారు. విజవాయడలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో వి.నివాస్, బి.సంతోష్‌లు, అండర్-14 బాలుర విభాగంలో కె.సుహాష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టీమ్‌కు ఎంపికయ్యారన్నారు. సత్యసాయి జిల్లాలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను పీడీ లూయిస్‌ను అభినందించారు.

ఆగిరిపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో ఈదర హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి గొర్రుముచ్చు అభిలాష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎస్.శారద తెలిపారు. పాఠశాల పీడీ ప్రమీలరాణిని సర్పంచ్ డి.అనిత, ఏసుపాదం అభినందించారు.




ఎంపికైన ఎంపికైన గుడిపాడు, ఈదర విద్యార్థులతో ఉపాధ్యాయులు

రీ సర్వే గ్రామసభలు

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగిన రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు నూజివీడు ఆర్డీవో వాణి అన్నారు. శుక్రవారం సూరేపల్లిలో జరిగిన రీ సర్వే గ్రామ సభను ఆమె తనిఖీ చేసి, సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు ఇచ్చారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఎటువంటి అభ్యంతరాలున్న గ్రామసభల్లో రైతులు అర్జీలు ఇవ్వాలని ఆర్డీవో సూచించారు. పలు సమస్యలపై 32 అర్జీలు రైతుల నుండి వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహశీల్దార్ శర్మ తెలిపారు. శనివారం కొర్లకుంట గ్రామంలో రీ సర్వే గ్రామసభ జరుగుతుందని ఆయన తెలి పారు. సర్పంచ్ ఎం.సుధారాణి, వీఆర్వో హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సూరేపల్లిలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో వాణి

పర్వతాపురం సభలో వాగ్వాదం..

చాట్రాయి: పర్వతాపురంలో శుక్రవారం జరిగిన రీ సర్వే గ్రామసభలో సర్పంచ్ మిద్దే శివాజీ, స్థానిక టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. చీపు సత్యవతి అనే మహిళ తన భూమి ఆక్రమణకు గురైందని అధికారులకు తెలపగా, సర్పంచ్ మిద్దే శివాజీ వివరణ ఇచ్చే యత్నం చేయటంతో టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీనిపై వాగ్వాదం జరగ్గా టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొర్రా నాగేశ్వరరావు, అధికారులు ఇరువర్గాలకు సర్దిచెప్పటంతో సద్దుమణిగింది. తహసీల్దార్ ప్రశాంతి మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయని, రైతులు పరిశీలించుకొని ఏమైనా తేడాలుంటే అర్జీ సమర్పిస్తే సరి చేస్తామని అన్నారు. ఆన్‌లైన్‌లో విస్తీర్ణంలో వ్యత్యాసం ఉంటే ఎవరూ ఆందోళన చెందవద్దని క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కరిస్తాని అన్నారు. భూ సమస్యలపై 15 మంది రైతులు అర్జీలు సమర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం. గీత, సర్వేయర్ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు చెన్నారావు, దిలీప్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: భూముల రీ సర్వేలో లోపాలు సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి తహసీల్దార్ ఎస్‌కె సుబానీ తెలిపారు. గురజలో ఆయన శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో పలువురు రైతులు రీ సర్వే వల్ల ఉమ్మడి ఎల్‌పి నంబర్లు నమోదయ్యాయని, దీనివల్ల ఎవరి భూమిపై వారు రుణాలు తీసుకునేందుకు గానీ, భూములను అమ్ముకునేందుకు గానీ అవకాశం లేదని తెలిపారు. ఉమ్మడి ఎల్‌పీల అంశం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు. పెనుమల్లి, సంకర్షణపురం గ్రామాల్లో పౌరసరఫరాల డీటీ కుమారి, సర్వే యర్ రాజశేఖర్‌రెడ్డి సభలు నిర్వహించారు.

కలిదిండి: కొండూరు రీ సర్వే గ్రామసభలో విస్తీర్ణం, పేర్లు, ఎల్‌పీఎం సబ్ డివిజన్ సవరణలపై రైతులు 38 అర్జీలు సమర్పించారని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రమణరావు, ఆర్‌ఐ శ్యామల, వీఆర్వో పమిడేశ్వరరావు, సర్పంచ్ వెంకటలక్ష్మి, సర్వేయర్లు పాల్గొన్నారు.

మార్చురీలో మృతదేహం మాయం చేస్తుండగా..

- అడ్డుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి
- విచారణకు ఆదేశించిన ప్రిన్సిపాల్



ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒక మృతదేహాన్ని తస్కరించగా మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి గుర్తించి అధికారులకు చెప్పడంతో వెంటనే ఆ మృతదేహాన్ని మళ్ళీ యథాస్థానంలో పెట్టేశారు. ఈ విషయాన్ని కొద్ది రోజుల పాటు ఆ విభాగానికి సంబంధించిన అధికారులు గుట్టు చప్పుడు కాకుండా దాచారు. ఆ తర్వాత చర్యలు చేపట్టారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో నాలుగు సంవత్సరాల క్రితం ఎలుకలు వచ్చి మృతదేహం కళ్ళు, కాలి వేళ్ళు తినేయడంతో రాష్ట్ర స్థాయిలోనే సంచలనం కలిగించింది. ఆ తరువాత ఏడాది క్రితం ఆ మార్చురీ వద్ద పోస్టుమార్టం చేయాలంటే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న సంఘటన వెలుగులోకి రావడంతో అక్కడ పనిచేసే ఔట్‌సోర్సు ఉద్యోగిని శాశ్వతంగా తొలగించారు. ఆ తర్వాత అంతా సవ్యంగానే కొనసాగుతుందన్న తరుణంలో ఇటీవల అక్కడ పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి (మార్చురీ అసిస్టెంట్) అర్ధరాత్రి వేళ ఒక మృతదేహాన్ని అంబులెన్సులో ఎక్కించుకుని తీసుకువెళ్తుండగా ఆ సమయంలో డ్యూటీలో ఉన్న ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగి (మార్చురీ అసిస్టెంట్) వెంటనే గుర్తించింది. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చింది. దీనితో మృతదేహాన్ని మార్చురీలో వదిలేశారు. చివరకు ఈ విషయంపై తర్జన భర్జన పడ్డ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని తస్కరించిన ఉద్యోగిని మార్చురీ నుంచి తొలగించి మెడికల్ కాలేజీలో ఉన్న మార్చురీ విభాగానికి పంపించారు. అయితే ఆ విభాగానికి చెందిన ప్రధాన అధికారి శుక్రవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశిదర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు సిఫార్సు చేశారు.

మృతదేహాలు ఎవరికి అవసరం....

సాధారణంగా మృతదేహాలను మెడికల్ కాలేజీ లు కొనుగోలు చేస్తూ తమ ల్యాబ్‌లలో కెమికల్‌లో నిల్వ చేస్తూ ఉంటారు. ఆసుపత్రులలో ఎవరూ తీసుకువెళ్ళకుండా వదిలివేసిన అనాథ మృత దేహాలను సాధారణంగా అధికారికంగానే సొమ్ములను చెల్లించి తీసుకువెళ్తా ఉంటారు. ఇప్పుడు మృత దేహాలు లక్షల రూపాయలు చెల్లిస్తే కాని పొందలేని పరిస్థితి ఉండడంతో అక్రమ మార్గంలో కొనుగోలు చేయాలని మొత్తం మీద ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ద్వారా రాయ బారాలు నడిపారా? మరే ఇతర ఉద్యోగులు ఎవరైనా బేరం కుదుర్చుకున్నారా.. అని చెప్పుకుం టున్నారు. అయితే ఆ ఉద్యోగి చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని అనాథ మృత దేహాలు మున్సిపల్ సిబ్బందికి అప్పగించి ఖననం చేయించారో లెక్క తేల్చాల్సి ఉంది. అంతేకాకుండా ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి మృత దేహాన్ని తస్కరించడానికి ప్రయత్ని ంచిన ఆ ఉద్యోగికి ఎవరు సహకరించారో? ఏ వాహనాన్ని వినియోగించారు? మృత దేహాన్ని కొనుగోలు చేసేదెవరు? వంటి వివరాలు పోలీసు కేసు నమోదైతేనే దర్యాప్తులో వెలుగులోకి రానున్నాయని అంటు న్నారు. సీసీ కెమెరా పుటేజిలను పరిశీలించాల్సి ఉన్నది.

విచారణకు ఆదేశించాం : డాక్టర్ శశిధర్

ఈ సంఘటనపై ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిదర్‌ను వివరణ కోరగా మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలోనే మార్చురీ నిర్వహణ ఉంటుందన్నారు. అక్కడ పనిచేస్తున్న అశోక్ అనే ఔట్‌సోర్సింగ్ మార్చురీ అసిస్టెంట్‌పై ఫోరెన్సిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ భాస్కర్ రాతపూర్వకంగా శుక్రవారం ఫిర్యాదు ఇచ్చారన్నారు. పూర్తిస్థాయి విచారణ జరపాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను కోరామని ఆయన చెప్పారు.



బాల్య వివాహాలపై ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలు నేరం

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అనేక క్లిష్ట పరిస్థితులను తీసుకువస్తున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ అన్నారు. దిగవల్లి క్లస్టర్ పరిధిలో అంగన్వాడీలతో బాల్య వివాహాలపై అవగాహన కల్పించి ప్రమాణాలను చేయించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే 1098 నంబరకు కాల్ చేయాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ముదినేపల్లి మండలంలోని యుపి, జిల్లా పరిషత్తు హైస్కూళ్లలో బాల్య వివాహాల వ్యతిరేక ర్యాలీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులతో బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. నిర్దేశిత వయస్సు వచ్చే వరకు తాము వివాహాలు చేసుకోబోమని వాడవల్లి యూపీ స్కూల్ హెచ్‌ఎం, యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ముదినేపల్లి, గుజర హైస్కూళ్లలో హెచ్‌ఎంలు విజయకుమార్, జి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞలు చేయించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు మహిళా టీచర్లు వివరించారు.



యువజనోత్సవాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

యువజనోత్సవాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాల్జెడ్ అండ్ టెక్నాలజీ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు జానపద గీతం అంశంలో కల్యాణ్, నవ్యశ్రీ బృందాలు ప్రతిభ కనబర్చాయి. కల్యాణ్ బృందం మొదటి స్థానంలో, నవ్య బృందం రెండో స్థానంలో నిలిచాయి. వీరి రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొననున్నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకడమిక్ రత్నాకర్ విద్యార్థులను అభినందించారు.

రహదారి మరమ్మతులకు నడుం బిగించిన రైతులు

చాట్రాయి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగొలనుపేటలో వ్యవసాయ భూములకు వెళ్ళే నల్లరాళ్ళ రోడ్డు వర్షాలకు ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారటంతో రైతులు తమ సొంత సొమ్ముతో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. రహదారి కోతకు గురై ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో రాజకీయాలకతీతంగా రైతులంతా ముందుకు వచ్చి విరాళాలు వేసుకుని ఎక్సకవేటర్ ఏర్పాటు చేసి రహదారికి మరమ్మతులు చేయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కైకలూరు సబ్ స్టేషన్లో సాధారణ మరమ్మతుల కోసం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కైకలూరు సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

కైకలూరు ఎంపీడీవోగా ఫణీంద్ర

కైకలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎంపీడీవోగా రెడ్డిబత్తుల ఫణీంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అల్లూరి జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన ఉమా మహేశ్వరరావు పాలకొల్లు బదిలీ అయ్యారు. ఫణీంద్రను ఎంపీపీ అడవి కృష్ణ, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో టిహాన్ ఐఐటీ హైదరాబాద్ సహకారంతో హన్‌సెస్ ఆఫ్ రోడ్డు వెహికల్ డిజైన్ అండ్ అనాలసిస్ అనే అంశంపై వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఐటీ రూర్కెలాకు చెందిన డాక్టర్ స్వప్నిల్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఇఫ్తికర్ హుస్సేన్ ముఖ్య అతిథిలుగా పాల్గొని వెహికల్ డిజైన్‌కు సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు. మెకానికల్ విభాగంలో డిజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. హెచ్‌వోడీ డాక్టర్ పావని, కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన రైతులకు అగ్రిమెంట్లు ఇవ్వాలి

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విత్తన రైతులకు కంపెనీల ద్వారా అగ్రిమెంట్లు ఇవ్వడంతో పాటు సబ్సిడీపై ఎరువులను అందించాలని సీఐటీయూ అనుబంధ విత్తన రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అధిక దిగుబడులను ఆశ చూపి రైతులతో పంట సాగు చేయిస్తున్నారని తీరా నష్టాలు వస్తే సీడ్ కంపెనీలు స్పందించకుండా రైతులను మోసం చేస్తున్నాయన్నారు. వీటిని నివారించేందుకు అగ్రిమెంట్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రాజు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గంటా పాపారావు, మండలాధ్యక్షుడు లెనిన్, బోస్ పాల్గొన్నారు.

డీపీఆర్టీయు మండల అధ్యక్షుడిగా ఏసుబాబు

చాట్రాయి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డీపీఆర్టీయు చాట్రాయి మండల ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏసుబాబు, తేరా రామారావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను నూతన కార్యవర్గాన్ని అభినందించి మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించి విద్యా బోధనకే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని కోరారు. రాష్ట్ర జిల్లా నాయకులు శోభనబాబు, ఆర్. నాగేశ్వరరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

తుప్పలు తొలగించిన గ్రోవెల్

ముదినేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరు పంచాయతీ పరిధిలో సింగరాయపాలెం - భీమవరం స్టేట్ హైవే వెంబడి పెరిగిన తుప్పలను శుక్రవారం తొలగించారు. ఆ గ్రామ ప్రముఖుడు, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణ ప్రోత్సాహంతో సింగరాయపాలెం గ్రోవెల్ ఫీడ్స్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం విశ్వనాద్రిపాలెం గ్రామం పొడవునా సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న ముళ్ల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సర్పంచ్ తాడంకి శిరీష, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గిరిజ, వీఆర్వో వెంకట్రావు, కూటమి నాయకులు గుడివాడ వేణు, గుడిసేవ సురేష్, తాడంకి రాజేష్ తదితరుల పర్యవేక్షించారు.

మునగాకులో పోషకాలు

ఆగిరిపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బోధనపల్లి ఎంపీయూపీ స్కూల్ ఆవరణలోని అంగన్ వాడీ కేంద్రంలో మునగాకు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో నురాణి మాట్లాడుతూ ఆహార వైవిధ్యాన్ని ప్రోత్సహించటం మునగాకు వినియోగాన్ని ప్రజలకు అలవాటు చేయటం ఈ కార్యక్రమం ఉద్దేశం అని మునగాకులో ఉండే పోషక విలువలు గర్భవతులు, బాలింతలలో రక్తహీనత నివారణకు తోడ్పడతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రపరిధిలోని తల్లులతో మునగాకులు, వంటల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎంపీపీ స్కూల్ బాల బాలికలతో బాల్య వివాహాలను నిరోధించాలని ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ జి.రాగమయి, ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు హాజరయ్యారు.